
ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపర్ పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

కర్నూలు, డోన్, ఆత్మకూరు, కల్లూరు	- 99854 09260
కర్నూలు, కోడుమూరు, నందికొట్కూరు	- 9985411379
ఆదోని, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు	- 9985171793
నంద్యాల, పాణ్యం, ఆళ్ళగడ్డ, బనగానపల్లె	- 9985411377


77 చెరువులకు కృష్ణా జలాలు ఎత్తిపోసే హంద్రీనీవా ప్రధాన కాలువ

ఈ ప్రభుత్వం కూడా ఇంతేనా..!



ప్రభుత్వం మారితే తలరాతలు మారుతాయనుకున్న రైతులకు అడియాశలే మిగిలాయి. హంద్రీనీవా కాలువ నుంచి 77 చెరువులకు కృష్ణా జలాలు ఎత్తిపోయడంపై ఆనాటి వైసీపీ ప్రభుత్వం చూపిన నిర్లక్ష్యమే నేటి టీడీపీ కూటమి ప్రభుత్వం కూడా ప్రదర్శిస్తున్నది. వైఎస్ జగన్ చేసిన తప్పిదాలను చంద్రబాబు సవరిస్తారని అనుకున్న జనం ఈ ప్రభుత్వం కూడా ఇంతేనా? అని ఆవేదన చెందుతున్నారు. నిత్యం కరువుతో తల్లడిల్లే డోన్, పత్తికొండ, ఆలూరు, పాణ్యం నియోజకవర్గాల్లో కరువు రైతులకు 'కన్నీటి' కష్టాలు తప్పడం లేదు. కళ్ల ముందే కృష్ణా జలాలు జిల్లా సరిహద్దులు తరలిపోతున్నాయి. ఆ నీటిని ఎత్తిపోసేందుకు రూ.221 కోట్లకు పైగా ప్రజాధనం వెచ్చించి నిర్మించిన ఎత్తిపోతల పథకం సిద్ధంగా ఉంది. లేనిదల్లా పాలకుల్లో చిత్తశుద్ధి. 52 మంది ఔట్ సోర్సింగ్ సిబ్బందిని నియమిస్తే.. కృష్ణా జలాలు ఎత్తిపోసి 68 చెరువులు నింపుతామని ఇంజనీర్లు ప్రతిపాదనలు పంపితే గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. కొత్తగా వచ్చిన టీడీపీ ప్రభుత్వం మేమేం తక్కువ అన్నట్లు వ్యవహరిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ప్రతిపాదలనకు పలు కొర్రీలు పెట్టి వెనక్కి నెట్టేసింది. నిర్వహణ సిబ్బంది నియమించకపోవడంతో 19 చెరువులను మాత్రమే నింపుతున్నారు. వాటిలో 13 చెరువులు డోన్ నియోజకవర్గంలో ఉన్నాయి.

- 77 చెరువులకు కృష్ణా జలాల ఎత్తిపోతల ఏమైంది?
- చివరికి 19 చెరువులకే కుదింపు
- ఇప్పటికే రూ.221 కోట్లకు పైగా ప్రజాధనం ఖర్చు
- నిర్వహణ సిబ్బంది లేక నెరవేరని లక్ష్యం
- 52 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని ఇవ్వాలని ప్రతిపాదన
- టీడీపీ కూటమి ప్రభుత్వంలోనూ అదే నిర్లక్ష్యం
- డోన్, పత్తికొండ ఎమ్మెల్యేలు దృష్టి సారించపోతే కరువు రైతులకు కన్నీళ్లే

కర్నూలు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతమైన పత్తికొండ, ఆలూరు, డోన్ నియోజకవర్గాల్లో ఏటేటా కరువు దరువేస్తున్నది. కరువు.. వలసలు కవలల్లా వెంటాడుతున్నాయి. ఈ నియోజకవర్గాల గుండా హంద్రీ నీవా సుజల స్రవంతి ఎత్తిపోతల ప్రాజెక్టు ప్రధాన కాలువ ప్రవహిస్తున్నది. కృష్ణా జలాలు జిల్లా సరిహద్దులు దాటిపోతున్నా.. జిల్లాలోని మెట్ట పొలాలకు మళ్లించలేని పరిస్థితి ఉంది. రాయలకాలంలో తవ్విన చెరువులు వర్షాభావం వల్ల ఒట్టిపోతున్నాయి. సాగునీరు దేవుడెరుగు.. మూగ జీవాలకు తాగునీరు అందని దైన్యపరిస్థితి ఉంది. హంద్రీ-నీవా కాలువ కుడి, ఎడమ వైపుల ఉన్న ఆయా గ్రామాల 105 చెరువులకు కృష్ణా జలాలు ఎత్తిపోసి పల్లెసీమ రైతుల కన్నీళ్లు తుడవాలనే సంకల్పంతో రాష్ట్ర విభజన తరువాత ఆనాటి టీడీపీ ప్రభుత్వం డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి సీఎం చంద్రబాబు ఒత్తితెచ్చి రూ.224.31 కోట్లు మంజూరు చేయించారు. ఫేజ్-1 కింద 1.238 టీఎంసీలు ఎత్తిపోసి 68 చెరువులు నింపే పనులకు 2018 మార్చి 20న జీవో నంబరు 169 జారీ చేశారు. కోయా కంపెనీ ఈ పనులను దక్కించుకుంది. గత టీడీపీ ప్రభుత్వంలోనే 35 శాతం వరకు పనులు పూర్తయ్యాయి. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం మొదట్లో నిర్లక్ష్యం చేసినా.. గత ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో ఎట్టకేలకు 90-95 శాతం పనులు పూర్తి చేశారు. ఎన్నికల ముందు హడావుడిగా నాటి సీఎం జగన్ చేత ప్రారంభించారు. 68 చెరువుల నుంచి 77 చెరువులకు పెంచారు. రివైజ్డ్ ఎస్టిమేషన్ (ఆర్ఈ) రూ.267.23 కోట్లకు అంచనాలు పెంచారు. అయితే.. ఈ ప్రాజెక్టు నిర్వహణ కోసం అవసరమైన ఓట్ సోర్సింగ్ సిబ్బంది నియమకాన్ని మాత్రం నాటి వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇప్పుడే అదే శాపంగా మారింది.

ఎమ్మెల్యేలు చొరవ చూపకపోతే కన్నీళ్లే!

హంద్రీ నీవా కాలువలో నీళ్లున్నా చెరువులు నింపుకోలేని దైన్యం. నాడు వైసీపీ ప్రభుత్వం చూపిన నిర్లక్ష్యమే.. నేడు కూటమి ప్రభుత్వం చూపుతోంది. నిధులు ఇవ్వకపోతే నిర్వహణ సాధ్యమా..? చెరువులు నింపగలరా..? పాలకులకు ఆ మాత్రం చిత్తశుద్ధి లేదా..? అని కరువు రైతులు ప్రశ్నిస్తున్నారు. డోన్, పత్తికొండ ఎమ్మెల్యేలు కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, కేఈ శ్యాంబాబు ప్రత్యేక చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు. సీఎం చంద్రబాబు, జలవనరులు శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుపై ఒత్తిడి తెచ్చి నిర్వహణ సిబ్బంది నియామకం, నిధులు మంజూరు చేయించాలి. లేదంటే ఆ ప్రాజెక్టు కూడా మరో గురురాఘవేంద్ర ప్రాజెక్టులా మారే ప్రమాదం ఉంది.


హంద్రీనీవా కాలువ ఒడ్డున నిర్మించిన నిర్మించిన ప్రధాన పంప్‌హౌస్

నీరు ఎత్తిపోస్తున్న చెరువులు ఇవే..

- **డోన్ నియోజకవర్గం :** డోన్ మండలం ఎల్లారెడ్డి చెరువు, మల్లెంపల్లె చెరువు, వెంకటాపురం ఎంఐ చెరువు, ఉడుములపాడు చెరువు, యాపదిన్నె చెరువు, ఓబులాపురం నడిమి కంటు, జమ్మికుంట, కల్పన కుంట, చనుగొండ్ల చెరువు, నల్లచెరువు, ప్యాపిలి మండలం సర్దార్‌కుంట, ఎనుగుమర్రి ఎంఐ చెరువు.
- **పత్తికొండ నియోజకవర్గం:** కృష్ణగిరి మండలం గుంటి రంగనాథస్వామి చెక్‌డ్యాం, కటారుకొండ చెరువు, అలంకొండ చెరువు, తుగ్గలి మండలం బొందిమడుగుల చెరువు, ముక్కెల్ల చెరువు, రాంపల్లి చెరువు, అయ్యవారికుంట.

కొర్రీలు పెట్టి వెనక్కి పంపేశారు

ఒప్పందం మేరకు కాంట్రాక్ట్ సంస్థ హంద్రీనీవా కాలువ నుంచి 77 చెరువులకు నీటిని పోత్తిపోసే ప్రధాన పంప్‌హౌస్, డెలివరీ ఛాంబర్, 200 కిలోమీటర్ల పైప్‌లైన్, 159 క్యూసెక్కులు ఎత్తిపోతల సామర్థ్యంతో మూడు 3800 హెచ్‌పీ విద్యుత్ పంపులు (ఒక్కొక్కటి 53 క్యూసెక్కులు) ఏర్పాటు మాత్రమే చేయాలి. చెరువులకు నీరు మళ్లించే బాధ్యత ఇరిగేషన్ అధికారులదే. పంప్‌హౌస్, డెలివరీ ఛాంబర్, పైపులైన్ నిర్వహణ కోసం రెండు సిఫ్టులలో పని చేయడానికి 84 మంది ఔట్ సోర్సింగ్ సిబ్బంది నియమించాలని, ఇందుకు నెలకు రూ.15 లక్షలు చొప్పున ఏడాది రూ.1.80 కోట్లు నిధులు మంజూరు చేయాలని కోరుతూ పనులు పర్యవేక్షిస్తున్న జలవనరుల శాక ఎఫ్ఆర్ఎల్ డివిజన్ ఇంజనీర్లు ప్రాజెక్ట్ సీఈ కబీర్‌బాషా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. పంప్‌హౌస్, డెలివరీ ఛాంబర్ నిర్వహణకు మూడు షిఫ్టులకు 18 మంది, గ్రావిటీ మెయిన్ పైప్‌లైన్, డెలివరీ సిస్టమ్, డిస్ట్రిబ్యూటరీ సిస్టమ్ నిర్వహణకు ఒక్క షిఫ్టుకు లస్కర్లు 27, సూపర్‌వైజర్లు ఐదుగురు చొప్పున రెండు షిఫ్టులకు 64 మంది కలిపి మొత్తం 82 మంది సిబ్బంది అవసరమైన, ఔట్ సోర్సింగ్ జీవో మేరకు ఒక్కొక్కరికి రూ.15-18 వేలు ప్రకారం నెలనెలా వేతనం చెల్లించాలని ప్రతిపాదించారు. ఆ ఫైలును జలవనరుల శాఖ రాష్ట్ర అధికారులు కొర్రీలు పెట్టి వెనక్కి నెట్టేశారు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం

హంద్రీనీవా కాలువ నుంచి 77 చెరువులకు కృష్ణా జలాలు ఎత్తిపోయాలంటే 200 కిలోమీటర్ల పైపులైన్ ఉంది. 8 కిలోమీటర్లకు రెండు షిఫ్టుల్లో ఇద్దరు ఔట్ సోర్సింగ్ సిబ్బంది అవసరం ఉంది. పంప్‌హౌస్, డెలివరీ ఛాంబర్, సిస్టమ్, డిస్ట్రిబ్యూటరీలను నిర్వహించాలి. దాదాపు 82 మంది సిబ్బంది అవసరం ఉంటుంది. నెలకు రూ.15 లక్షలు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ప్రస్తుతం 19 చెరువులను మాత్రమే నింపుతున్నాం.

- రామకృష్ణ, డీఈఈ, ఎఫ్ఆర్ఎల్ సబ్ డివిజన్, కర్నూలు

మరో ఐదుగురికి తీవ్ర అస్వస్థత

- ఒకరికి కర్నూలు, మరో ఆరుగురికి ఆదోనిలో చికిత్స
- రేకుల షెడ్డు వేడి, ఉడకని అన్నం వల్లే అంటున్న విద్యార్థినులు


చికిత్స పొందుతున్న విద్యార్థినులు

ఆదోని/ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 20 : ఆదోని మండిగిరి పంచాయతీ పరిధిలోని ఆర్టీ నగర్‌లో ఉన్న ప్రభుత్వ బాలికల కళాశాల హాస్టల్ విద్యార్థినుల్లో మరో ఐదుగురు శుక్రవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఉదయం కళాశాలకు వెళ్లిన విద్యార్థినిలు ఉదయం ముగ్గురు స్పృహ తప్పి పోగా, మధ్యాహ్నం మరో ఇద్దరు తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో కళాశాల ప్రిన్సిపాల్ సంజయన్న, అధ్యాపకులు హుటాహుటిన అంబులెన్స్‌లో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. గురువారం ఇందు భాగ్యమ్మ అస్వస్థతకు గురయ్యారు. ఇందు అనే విద్యార్థినికి బీపీ కంట్రోల్ కాక పరిస్థితి విషమించడంతో వైద్యులు మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. సింధు, శిరీష, మహాలక్ష్మి, రాజేశ్వరి, లేఖన అనే విద్యార్థినులు ఆదోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరంతా రేకుల షెడ్డు వల్ల అధిక వేడికి గురైనట్లు డా. శ్రీరాములు నాయక్ తెలిపారు. వారి పరిస్థితి ప్రస్తుతం బాగుందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. చికిత్స పొందుతున్న విద్యార్థినులను తహసీల్దార్ శివరాముడు పరామర్శించి వైద్యులను, వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌కు వెళ్లి విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేయాలని వైద్యులకు సూచించడంతో డా. శ్రీరాం నాయక్, డా. జగదీష్‌తోపాటు మరో ముగ్గురు వైద్యులు హాస్టల్ చేరుకొని వారితో మాట్లాడారు. హాస్టల్ విద్యార్థినులు ఉడకని అన్నం, నీళ్ల సాంబార్, ఆకు కూర పప్పు వడ్డిస్తున్నారని వాపోయారు. ప్రతి రోజూ మధ్యాహ్నం పచ్చి మిరపకాయల పప్పును క్యారియర్‌లో పంపుతున్నారని, అది తినేలోపు చెడిపోతోందని కన్నీరు పెట్టుకుంటున్నారు. సాయంత్రం వేళ కనీసం స్నాక్స్ కూడా ఇవ్వడం లేదన్నారు. హాస్టల్ వార్డెన్ పరిమళమ్మను అడిగితే... తమను బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రేకుల షెడ్డు కింద ఉక్కపోతతో అల్లాడుతున్నామని, ఫ్యాన్‌లు కూడా లేవని తెలిపారు.


హాస్టల్‌ను పరిశీలిస్తున్న అధికారులు

తగ్గిన పత్తి ధర

క్వింటాలు రూ.8139

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 20 : వారం రోజులుగా పత్తిధరలు రైతులను ఊరించాయి. అంతలోనే పత్తిధరలు పడిపోయాయి. ధరలు పతనం కావడంతో రైతులు నిరాశకు గురవుతున్నారు. శుక్రవారం పత్తిధర క్వింటం గరిష్టంగా రూ.8,139 పలికింది. ఒక్కరోజులోనే క్వింటానికి రూ.150 పైగా ధర తగ్గడం పై రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్ దిగుబడులు చేతికి రావడంతో మొదటి కోత దిగుబడిని విక్రయానికి భారీగా తీసుకొచ్చారు. 11,627 క్వింటాలు రావడంతో వ్యాపారులు ధరలు తగ్గించారని రైతులు వాపోతున్నారు. ఇలా ధరలు తగ్గితే పెట్టుబడి ఖర్చులు కూడా రాక అప్పుల పాలు అవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తిధర క్వింటాలు కనిష్ఠ ధర రూ.4,489, గరిష్ఠ ధర రూ.8,139, మధ్యస్థ ధర రూ.7,769 పలికింది.

రాసిచ్చేశారు..!

- పంచాయతీ అనుమతి లేకుండానే చెరువుల్లో చేపల పెంపకానికి అధికారుల అనుమతి
- అభ్యంతరం తెలిపిన సర్పంచ్, వార్డు సభ్యులు
- తీర్మానం లేకుండా ఎలా కేటాయిస్తారని నిలదీత

మద్దికెర, సెప్టెంబరు 20: పంచాయతీ అనుమతి లేకుండానే రాసిచ్చేశారు. అది కూడా మూడు చెరువులు కలిపి రూ.25 వేలకే అప్పగించేశారు. ఎలాంటి తీర్మానం లేకుండానే చేపల పెంపకానికి అధికారులు అనుమతి ఇవ్వడంపై సర్పంచ్, వార్డు సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మద్దికెర పంచాయతీ పరిధిలో యజ్ఞం చెరువు, భవనాసి, మద్దమ్మ కుంటలు ఉన్నాయి. ఇవి దాదాపు 70 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నట్టు రికార్డులు తెలుపుతున్నాయి. వీటిని ఏటా హంద్రీ నీటితో నింపుతారు. ఈ సారి కూడా హంద్రీ నీరు వదలడంతో కళకళలాడుతున్నాయి. అయితే గ్రామంలోని బెస్త కులానికి చెందిన కొంత మంది తాము చేపలు వదులుకొని జీవనం సాగిస్తామని, ఆ మేరకు ప్రభుత్వం నుంచి జీవో కూడా ఉందంటూ అధికార పార్టీ నాయకుల చుట్టూ తిరుగుతూ వచ్చారు. ఈ క్రమంలోనే శుక్రవారం సర్పంచ్ బండారు సుహాసినికి, పంచాయతీ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా డీఎల్‌పీవో ప్రకాష్ నాయుడు గ్రామానికి చేరుకొని బెస్త కులస్థులకు మూడు చెరువులను రాసిచ్చాడు. పంచాయతీ కార్యదర్శి శివకుమార్ ఆధ్వర్యంలో ఏడాదిపాటు చేపలు వదిలి పట్టుకోవడానికి మూడు చెరువులను కలిపి రూ.25 వేలకు రాసిచ్చాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ సుహాసిని, పంచాయతీ సభ్యులు ఎన్.లక్ష్మీనారాయణ, జంబునాథ్ రాయుడు, లక్ష్మీదేవి, మరికొంత మంది పంచాయతీ కార్యదర్శి శివకుమార్‌తో వాగ్వాదానికి దిగారు. తమకు సమాచారం ఇవ్వకుండా ఎలా రాసిస్తారని నిలదీశారు. పంచాయతీ అభివృద్ధి కోసం గ్రామంలో అన్ని రకాల పన్నులు వసూలు చేస్తున్నామని, తమకు తెలియకుండా చెరువులను రాసివ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రూ.25 వేలతో చేసేదేమీ లేదని, ఉచితంగా రాసిస్తే పోయేదని అన్నారు. తీర్మానం చేయకుండా పంచాయతీ సభ్యులు, సర్పంచులకు తెలియకుండా రాసిస్తే తమకు ఏమి మర్యాద ఉంటుందని మండిపడ్డారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి శివకుమార్ వివరణ ఇస్తూ రాసిచ్చిందాన్ని రద్దు చేస్తామని, పాలక వర్గం సభ్యుల అభిప్రాయం మేరకు అనుమతులు ఇస్తామని అన్నారు.


ఈవోతో వాగ్వాదానికి దిగిన వార్డు సభ్యులు

అన్న క్యాంటీన్లు సిద్ధం

- నేడు రెండు ప్రారంభానికి ఏర్పాట్లు
- నగర పాలక పరిధిలో మొత్తం ఐదు క్యాంటీన్లు


ప్రారంభానికి సిద్ధమైన కలెక్టరేట్‌లోని అన్నక్యాంటీన్

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 20: అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మేనిఫెస్టోలో చెప్పినవిధంగా వాటి పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే కర్నూలు నగరంలో శనివారం రెండు అన్న క్యాంటీన్లను ప్రారంభించనున్నారు. నగర పాలక పరిధిలో రెండింటిని 23న మంత్రి టీజీ భరత్ ప్రారంభిస్తారు. ఇంకో క్యాంటీన్‌ను ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు.

నగర పాలక పరిధిలో ఐదు అన్న క్యాంటీన్లు..

నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం ఐదు అన్న క్యాంటీన్లను సిద్ధం చేస్తున్నారు. కొండారెడ్డి బురుజు, కలెక్టరేట్, ఎస్టేట్ సెట్కూర్ కార్యాలయం, ఉల్చాల రోడ్డులోని పరిమళ నగర్‌లో, ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు.

ఈ క్రమంలో శనివారం సెట్కూరు, పరిమళ నగర్‌లోని రెండు క్యాంటీన్లను ప్రారంభించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. దీంతోపాటు కలెక్టరేట్, పాత బస్టాండులోని క్యాంటీన్లను సోమవారం రాష్ట్ర మంత్రి టీజీ భరత్ ప్రారంభించనున్నారు. గతంలో ఈ క్యాంటీన్ల స్థానంలో సచివాలయాలు ఉండేవి. వాటిన్నంటినీ మరో చోటికి తరలించారు. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నారు. కలెక్టరేట్‌కు ప్రతి రోజూ వందల మంది వస్తుంటారు. అదేవిధంగా కొండారెడ్డి బురుజు ప్రాంతానికి జిల్లా నలుమూలల నుంచే కాకుండా తెలంగాణ రాష్ట్రం నుంచి కూడా ప్రజలు వస్తుంటారు. ఇక ఎస్టేట్‌లో ఎక్కువ శాతం పరిశ్రమలు ఉండటంతో అక్కడ పని చేసే కార్మికులకు కడుపు నిండా రుచికరమైన భోజనం పెట్టాలనే ఆలోచనతోనే ప్రారంభిస్తున్నారు. అంతేగాకుండా ఉల్చాల రోడ్డు పరిమళ నగర్ ప్రాంతంలో ఎక్కువ శాతం అన్ని వర్గాల ప్రజలు నివసిస్తున్నారు. ఇక ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వివిధ రాష్ట్రాల నుంచి రోగులతోపాటు వారి బంధువులు వస్తుంటారు.

మరమ్మతులకు రూ.50 లక్షలు..

ఒక్కో అన్న క్యాంటీన్ మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షలు కేటాయించింది. క్యాంటీన్‌లలో కిచెన్, ఎలక్ట్రికల్, పెయింటింగ్, ఫర్నిచర్, టైల్స్, తదితర వాటి కోసం మొత్తం 5 క్యాంటీన్లకు రూ.50 లక్షలు ఖర్చు చేస్తున్నారు. ఇంజనీరింగ్ విభాగం అధికారుల పర్యవేక్షణలో పనులు వేగవంతంగా జరుగుతున్నాయి.

అన్ని హంగులతో అన్న క్యాంటీన్లు



నగర పాలక సంస్థ పరిధిలోని అన్న క్యాంటీన్లను అన్ని హంగులతో సిద్ధం చేస్తున్నాం. ప్రభుత్వం సూచించిన విధంగానే మరమ్మతులు చేయిస్తున్నాం. ఇంజనీరింగ్ అధికారులు వేగవంతంగా పనులు చేయిస్తున్నారు. ముందుగా రెండు క్యాంటీన్లను ప్రారంభించేందుకు సిద్ధం చేశాం. ప్రజలకు రుచికరమైన భోజనం అందించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యం.

-ఎస్.రవీంద్రబాబు, కమిషనర్, నగర పాలక సంస్థ

కేసుల విచారణలో నిర్లక్ష్యం వద్దు: కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 20: ఎస్సీ, ఎస్టీ అత్యాచారం కేసుల విచారణలో నిర్లక్ష్యం ఉండకూడదని, పెండింగ్‌లో ఉన్న కేసుల విచారణ త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా పోలీస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అత్యాచార కేసుల విచారణ వేగవంతం కావడానికి పోలీసు, రెవెన్యూ అధికారుల మధ్య సమన్వయం ఉండాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులకు సంబంధించి పోలీసు, రెవెన్యూ శాఖలు ప్రత్యేకంగా రిజిస్టర్లు నిర్వహించి పరస్పరం కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విషయంలో నిబద్ధతతో పని చేస్తోందన్నారు. కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి మాట్లాడుతూ గూడూరు మండలంలోని బాలికల వసతి గృహంలో మరుగుదొడ్లు సరిగా లేవని కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. వసతి గృహాల్లో సీట్ల సంఖ్య పెంచేం దుకు తగిన చర్యలు తీసుకోవాలని, బోగస్ క్యాస్ట్ సర్టిఫికెట్లు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్పీ జి.బిందు మాధవ్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. సివిల్ రైట్స్‌డే కార్యక్రమాన్ని మరింత సక్రమంగా నిర్వహించి మంచి ఫలితాలు వచ్చేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. జాయింట్ కలెక్టర్ బి. నవ్య మాట్లాడుతూ సుమోటో క్యాస్ట్ సర్టిఫికెట్లు వెరిఫికేషన్‌కు సంబంధించి తప్పుగా జారీ అయ్యాయని, వచ్చిన ఫిర్యాదుల మేరకు రీవెరిఫికేషన్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్వో చిరంజీవి, కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు, కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డి, పత్తికొండ ఆర్డీవో రామలక్ష్మి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రంగలక్ష్మీదేవి, కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని, పత్తికొండ ఎస్డీపీవోలు, జిల్లా స్థాయి అధికారులు, డీవీఎంసీ సభ్యులు చిటికెల శామ్యూల్, రాజశేఖర్, శాంతికుమార్, నవీన్, రాజు, ఊట్ల రమేష్‌బాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

మతిమరుపుతో సతమతం

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 20: అల్జీమర్స్ సాధారణ మతిమరుపు కాదు. రోజువారి జీవితంలో మామూలు మతిమరుపుగా ఆరంభమై క్రమంగా అదొక తీవ్ర సమస్యగా మారుతుంది. సాధారణంగా 65 ఏళ్లపైబడిన వారిలో ఈ వ్యాధి వస్తుంది. దీని గురించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం సెప్టెంబరు 21న ప్రపంచ అల్జీమర్స్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. అల్జీమర్స్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 1994 నుంచి నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ప్రత్యేకించి పోస్టు డయాగ్నోస్టిక్ మద్దతుపై దృష్టి పెట్టింది. అల్జీమర్స్ వ్యాధి 60-70 శాతం అంగవైకల్యం కేసులకు కారణమవుతుందని, రాబోయే కాలంలో ఈ సంఖ్య పెరుగుతుందని సూచించింది. న్యూరోడిజెనరేటివ్ వ్యాధులు మెల్లగా ప్రారంభమవుతాయని హెచ్చరించింది. అల్జీమర్స్ వ్యాధి వచ్చాక మూడు రకాలుగా జ్ఞాపకశక్తి కోల్పోతుంటారు. తక్షణ జ్ఞాపక శక్తి, రీసెంట్ జ్ఞాపక శక్తి, రిమోట్ మెమోరీ అనే సమస్యలు ఉంటాయి. ఈ మూడింటిని మరిచిపోయే వారిలో కొన్ని లక్షణాలు కనిపిస్తుంటాయి. అలా కనిపిస్తే అల్జీమర్స్‌తో బాధపడుతున్నట్లు గుర్తించాలి.

● అప్రమత్తతే ఔషధం ● 65 ఏళ్లు పైబడిన వారిలో అల్జీమర్స్

నేడు వరల్డ్ అల్జీమర్స్ డే



గుర్తించడం ఇలా

- ఎప్పుడూ చేసే పనులు కూడా సొంతంగా చేసుకోలేకపోవడం.
- దారులు మరిచిపోవడం
- కళ్లద్దాలు, పెన్నులు మరిచిపోవడం
- ఒకే విషయంపై ఆలోచన చేయలేకపోవడం
- మాట్లాడుతున్నప్పుడు పొంతన కోల్పోవడం
- తిన్నది కూడా గుర్తు లేకపోవడం

అల్జీమర్ డిమాన్షియా ప్రమాదకరం

డిమాన్షియా (మతిమరుపు)ను రెండు రకాలుగా చెప్పవచ్చు. మొదటి వాస్క్యులర్ డిమాన్షియా. ఇది మెదడుకు సరిగ్గా రక్త ప్రసరణ జరగనివారిలో కనిపిస్తుంది. బీపీ, డయాబెటిక్, స్మోకింగ్, అధిక కొలస్ట్రాల్, ఆల్కహాల్ అలవాటు ఉన్న వారిలో లక్షణాలు కనిపిస్తాయి. రెండో సూడో డిమాన్షియా. ఇది వయస్సుతో సంబంధం లేకుండా వస్తుంది. అధిక ఒత్తిడి, డిప్రెషన్, ఆల్కహాల్, మాదక ద్రవ్యాలు వాడే అలవాటు ఉన్న వారిలో ఎక్కువగా కనిపిస్తుంది. మెదడులోని కణాలు తగ్గడం వల్ల ఈ వ్యాధి వస్తుంది. దీని బారిన పడిన వారికి తీవ్రమైన మతిమరుపు ఉంటుంది.

కారణాలివి

వయస్సు పైబడటం వల్ల మెదడు సెల్స్ తగ్గడమే అల్జీమర్స్‌కు ప్రధాన కారణం. బ్రెయిన్ సెల్స్ తగ్గడానికి ఒత్తిడి, నిద్రలేమి, జీవనశైలి మార్పు, విటమిన్స్ (బీ1, బీ12, బీ6)లోపం, జెనెటికల్‌గా కూడా అల్జీమర్స్ వస్తుంది. గుండెజబ్బులున్న వారు ఆల్కహాల్, డ్రగ్స్, పొగతాగే అలవాట్లు ఉన్న వారు దీని బారిన పడే అవకాశాలున్నాయి.



అల్జీమర్స్‌ను ప్రారంభ దశలో గుర్తించాలి



అల్జీమర్స్ వ్యాధితో ప్రపంచ వ్యాప్తంగా 60 మిలియన్ల మంది బాధపడుతున్నారు. 65 సంవత్సరాల వయస్సు దాటిన ప్రతి 9 మందిలో ఒకరు వ్యాధికి గురయ్యే అవకాశం ఉంది. ఈ వ్యాధిని ప్రారంభదశలోగుర్తించి వైద్యులను సంప్రదించి వ్యాధి లక్షణాలు పెరగకుండా చూసుకోవాలి.

- డాక్టర్ చల్లపల్లి బాబురావు, కన్సల్టెంట్ న్యూరాలజిస్టు, కర్నూలు కిమ్స్ హాస్పిటల్

ప్రాథమిక దశలోనే గుర్తించాలి

అల్జీమర్స్ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి చికిత్స అందించాలి. మెదడులో హార్మోన్ల విడుదల జరిగి కూడా కణాలకు యాక్టివ్ చేసే మందులను వాడాలి. వ్యాధిగ్రస్తులకు కుటుంబం సమాజం నుంచి తగిన సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. వ్యాధిగ్రస్తులతో ఎవరో ఒకరు మాట్లాడుతూ ఉండాలి. మెదడుకు పని చెప్పేలా చెస్, క్యారమ్స్, పజిల్స్ మ్యాజిక్ వంటివి బ్రెయిన్‌ను యాక్టివ్‌గా ఉంచుతాయి.

అవగాహన అవసరం



చాలా మందికి అల్జీమర్ పట్ల అవగాహన ఉండదు. మెదడు కణాలు తగ్గడం వల్ల ఈ వ్యాధి వస్తుంది. 65 ఏళ్ల పైబడిన వారిలో ఇది అధికంగా వస్తుంది. న్యూరాలజీ ఓపీ ప్రతి సోమ, గురువారాల్లో ఉంటుంది. వారంలో అల్జీమర్ అనుమానిత కేసులు 30 నుంచి 35 దాకా వస్తుంటాయి.

- డాక్టర్ సి.శ్రీనివాసులు, హెచ్‌వోడీ, న్యూరాలజీ విభాగం, కర్నూలు జీజీహెచ్

పల్లెల్లోనే ఎక్కువ



అల్జీమర్స్ కేసులు పట్టణాల్లో కన్నా గ్రామీణ ప్రాంతాల్లో అధికంగా ఉన్నాయి. అందుకు కారణం అల్జీమర్స్‌కు దారితీసే కారణాల్లో ఒకటైన స్మోకింగ్ పల్లెల్లో ఎక్కువ. అది కూడా చిన్న వయస్సు లోనే స్మోకింగ్‌కు అలవాటు ఉండటం వల్ల ఈ కేసులు నమోదవుతుంటాయి.

-డాక్టర్ ఎన్.సురేష్, న్యూరో ఫిజిషియన్, మెడికవర్ హాస్పిటల్, కర్నూలు

రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు తగవు

పోలీస్‌స్టేషన్‌లో డీసీసీ ఫిర్యాదు



బీజేపీ నాయకులపై ఫిర్యాదు చేస్తున్న డీసీసీ నాయకులు

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 20: లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై బీజేపీ నాయకులు చేసిన వ్యాఖ్యలపై నంద్యాల డీసీసీ అధ్యక్షుడు జె. లక్ష్మీనరసింహ యదవ్ మండిపడ్డారు. శుక్రవారం నగరంలోని నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు షేక్ జీలానీ బాషాతో కలిసి సీఐకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసింహ యాదవ్ మాట్లాడుతూ రాహుల్ గాంధీని హతమార్చాలంటూ బీజేపీ, శివసేన నాయకులు బహిరంగంగా విమర్శించడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఈ వ్యాఖ్యలపై సుప్రీం కోర్టు సుమోటోగా తీసుకుని బీజేపీ నాయకులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా డైరెక్షన్ లోనే ఇదంతా జరుగుతోందన్నారు. ఈ దుర్మార్గాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ అన్ని మతాలు, కులాలను సమానంగా చూస్తోందన్నారు. ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్న బీజేపీకి దేశాన్ని పాలించే అర్హత లేదన్నారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) చట్టాల మేరకు అలస్యం లేకుండా ఎఫ్ఐఆర్ నమోదు చేయించి తగిన చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నంద్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ జాకీర్, మనపాటి శ్రీనివాస్‌గౌడ్, కురువ రవి కుమార్, రజాక్ బాషా, అఫ్రోజ్, చెన్నయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన మురళీకృష్ణ



ఎస్పీని కలిసిన డీసీసీ

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 20: కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ పక్షనేత రాహుల్‌గాంధీపై బీజేపీ, శివసేన నాయకులు చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని ఎస్పీ బిందుమాధవ్‌ను కర్నూలు డీసీసీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో బిందుమాధవ్‌ను కలిశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బజారన్న, తిప్పన్న నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తవ్వుతున్న వాహనాల సీజ్

మంత్రాలయం, సెప్టెంబరు 20: మంత్రాలయం మండలంలోని వగరూరు గ్రామానికి చెందిన ఉరుకుందు, సూగూరు గ్రామానికి చెందిన కురువ రవికుమార్, షేక్ రజాక్ మూడు ట్రాక్టర్లల్లో ఇసుక తవ్వుతుండగా సీజ్ చేసినట్లు మంత్రాలయం ఎస్ఐ పరమేశ్ నాయక్ తెలిపారు. గురువారం అర్ధరాత్రి కురువ రాముడుకు చెందిన ఎక్స్‌కవేటర్‌తో వంకలో దిగి ట్రాక్టరులో ఇసుక వేస్తుండగా.. దాడులు చేసి పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. గత రెండు రోజుల క్రితం ఉరుకుందు అక్రమంగా ఇసుక తరలిస్తుండగా.. కేసులు నమోదు చేసి గనులశాఖకు నివేదికలు పంపినట్లు తెలిపారు. వగరూరు చెందిన ఉరుకుందు ట్రాక్టరుకు రూ.20వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక సరఫరా చేస్తే కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు.

జనన ధ్రువీకరణ పత్రాల జారీలో అవకతవకలు

పరిశీలించాలని కమిషనర్లకు డీఎంహెచ్‌వో లేఖ

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 20: జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో చోటు చేసుకుంటున్న అవకతవకలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.ఎల్.భాస్కర్ సంబంధిత కమిషనర్లకు లేఖ రాశారు. నగర పాలక సంస్థతోపాటు ఆదోని, ఎమ్మిగనూరు, గూడూరు మున్సిపాలిటీల్లో జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో అవకతవకలు చేసుకుంటున్నాయని ఆయన అందులో పేర్కొన్నారు. ప్రధానంగా నగర పాలక సంస్థ కార్యాలయంలో నిబంధనలు పాటించడం లేదని, నగర పాలక హెల్త్ ఆఫీసర్‌కు గట్టిగా ఆదేశాలు జారీ చేయాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ కమిషనర్‌ను కోరారు. నర్సింగ్ హోమ్‌లో, ప్రైవేట్ హాస్పిటళ్ల నుంచి వచ్చే నివేదికలను ఒకటికి రెండుసార్లు పరిశీలించాలని నగర పాలక ఎంహెచ్‌వోకు సూచించారు.

సంక్షేమ పథకాలను ప్రజల దగ్గరికి చేర్చండి: కలెక్టర్

కర్నూలు(రూరల్)సెప్టెంబరు20: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సక్రమంగా నూటికి నూరు శాతం ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కర్నూలు రూరల్ మండలం బి. తాండ్రపాడు గ్రామంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరితో కలిసి కలెక్టర్ ఇంటింటికి తిరిగి ఇది మంచి ప్రభుత్వం అనే స్టిక్కర్లను, కరపత్రాలను ప్రజలకు అందజేసి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల గురించి స్థానికులకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వందరోజుల పాలన పూర్తి అయిన సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసిందన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల అకాంక్షలకు అవసరాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నదన్నారు.

పెద్దహోతూరులో ఇరువర్గాల మధ్య ఘర్షణ

ఆలూరు, సెప్టెంబరు 20 : ఆలూరు మండలం పెద్దహోతూరు గ్రామంలో శుక్రవారం రాత్రి బీసీ, ఎస్సీ సామాజిక వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఐదుగురికి గాయాలు కావడంతో ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బోయ రాముడు అనే వ్యక్తి ఓ సామాజిక వర్గానికి చెందిన ఓ మహిళను అసభ్యంగా దూషించడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారి తీసింది. ఇరువురికి స్వల్ప గాయాలయ్యాయి. బోయ రాముడితో పాటు మరో నలుగురిపై అట్రాసిటీ కేసు నమోదు చేస్తున్నట్లు ఆలూరు ఎస్ఐ వెంకట నరసింహులు తెలిపారు. గ్రామంలో ఎలాంటి ఘర్షణలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

మొబైల్ రికవరీ మేళా

బాధితులకు 587 మొబైల్ ఫోన్లు



సెల్‌ఫోన్లను పరిశీలిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కర్నూలు, సెప్టెంబరు 20: జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ మైదానంలో మొబైల్ రికవరీ మేళా కార్యక్రమాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఎస్పీ జి.బిందు మాధవ్ ఆధ్వర్యంలో మొబైల్ ఫోన్లను సంబంధిత బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇటీవల కాలంలో మొబైల్ తమ జీవితంలో ఒక భాగమైందన్నారు. అటాచ్‌మెంట్స్, బ్యాంకు ఏటీఎం, బ్యాంకు ఖాతాలు, సెటిల్మెంట్లు, పర్సనల్ సమాచారం ఇలా ఎన్నో సేవలు మొబైల్ ద్వారా వినియోగిస్తున్నారమని తెలిపారు. మొబైల్స్ పోగొట్టుకుంటే ఎలాంటి రుసుము లేకుండా ఉచితంగా Http:// kurnoolpolice.in/mobiletheft వెబ్‌సైట్‌కు వెళ్లి పోగొట్టుకున్న సెల్‌ఫోన్ వివరాలు అందజేస్తే రికవరీ చేసేందుకు కర్నూలు సైబర్ ల్యాబ్ పోలీసులు కృషి చేస్తారన్నారు. శుక్రవారం మొబైల్ మేళా నిర్వహించి మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు సెల్‌ఫోన్లు అందించామని చెప్పారు. ఫోన్లు పోగొట్టుకున్న వారు జిల్లా పోలీస్ శాఖ తెలిపిన వెబ్‌సైట్‌కు లింక్‌ను క్లిక్ చేసి మొబైల్ లాస్ట్ కాలంలో మీపేరు, మీ జిల్లా, మీ పోలీస్‌స్టేషన్ పరిధి, మీ మొబైల్‌కు సంబంధించిన వివరాలు, ప్రస్తుతం ఉపయోగిస్తున్న మొబైల్ నెంబరు కాంటాక్ట్ వివరాలు సబ్‌మిట్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఐలు, సైబర్ ల్యాబ్ టెక్నికల్ టీమ్ శ్రీనివాసులు, అబ్దుల్‌గౌస్, కేశవరెడ్డి, సైబర్ ల్యాబ్ టెక్నికల్ టీమ్ సభ్యులు ఉన్నారు.

మంత్రాలయంలో సినీ నటుడు పూరీ ఆకాశ్



మంచాలమ్మకు పూజలు చేస్తున్న సినీ నటుడు పూరీ ఆకాశ్

మంత్రాలయం, సెప్టెంబరు 20: రాఘవేంద్ర స్వామి దర్శనార్థం ప్రముఖ సినీ దర్శకులు పూరీ జగన్నాథ్ కుమారుడు సినీ నటుడు పూరీ ఆకాశ్ గురువారం రాత్రి మంత్రాలయం వచ్చారు. ఈయనకు మఠం ఏఏఓ మాధవశెట్టి, మఠం మేనేజర్లు వెంకటేశ్ జోషి, శ్రీపతి ఆచార్, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

నిరుద్యోగులకు కుచ్చుటోపి

ఉద్యోగాల పేరుతో ఒక్కొక్కరి నుంచి రూ.1.50 లక్షల వసూలు

కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 20: ఓ స్వచ్ఛంద సేవా సంస్థ నిరుద్యోగులకు కుచ్చుటోపి పెట్టింది. ఉద్యోగాల ఆశ చూపి రూ.15 వేల జీతం ఇప్పిస్తామని చెప్పి ఒక్కొక్కరి నుంచి రూ.1.5 లక్షలు వసూలు చేసింది. ఆగస్టు 7న బుద్ద యోగా ఫౌండేషన్ అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇచ్చి పాఠశాలలో పని చేయండని స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు ఆదేశించారు. ఉత్తర్వులు తీసుకుని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల వద్దకు వెళితే.. తమకు జిల్లా విద్యాశాఖ అధికారుల నుంచి ఎలాంటి సమాచారం లేదని వారు చెప్పడంతో ఉత్తర్వులు అందుకున్న నిరుద్యోగులు తెల్లముఖం వేశారు. మోసపోయిన వారు పాఠశాలల చుట్టూ, విద్యాశాఖ అధికారుల చుట్టు తిరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. మోసపోయిన తమకు స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు నుంచి తిరిగి డబ్బులు ఇప్పించాలని గూడూరు మండలంలోని వడ్ల అరవింద్, దస్తగిరి, శ్రీరాములు అధికారులను కోరారు.

కొత్త విద్యుత్ సర్కిళ్ల ఏర్పాటుకు ప్రభుత్వ ఆదేశం

కొత్త ఆపరేషన్ సర్కిల్ కానున్న నంద్యాల జిల్లా

కల్లూరు, సెప్టెంబరు 20: రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన జిల్లాలను విద్యుత్ శాఖ ఆపరేషన్ సర్కిళ్లుగా ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఇంధన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఏపీఎస్పీడీసీఎల్, ఏపీఈపీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్ (డిస్కం) సీఎండీలను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల పునర్విభజన నేపథ్యంలో ఆయా డిస్కం పరిధిలో కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో ఆపరేషన్ సర్కిళ్లను ఏర్పాటు చేసేలా ఆదేశించారు. ఈ క్రమంలో నూతన సర్కిళ్ల ఏర్పాటులో డిస్కంలపై అదనపు భారం పడకుండా ప్రస్తుతం ఉన్న మానవ వనరులను సక్రమంగా కేటాయించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే పరిపాలన సౌలభ్యం కోసం ఖర్చులు లేకుండా వినియోగదారులకు మెరుగైన సేవలు అందజేసేలా కార్యాచరణ తయారు చేసేకోవాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అందుకు అనుగుణంగా నూతనంగా ఏర్పడిన జిల్లా కేంద్రాల్లో తగు చర్యలు చేపట్టాలని డిస్కం సీఎండీలను ప్రభుత్వం ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

కొత్త సర్కిల్లోని డివిజన్లు ఇవే...

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నంద్యాల కొత్త విద్యుత్‌శాఖ సర్కిల్‌గా ఏర్పడనుంది. ఈమేరకు నంద్యాల, డోన్, ఆత్మకూరు డివిజన్లు నంద్యాల జిల్లా విద్యుత్‌శాఖ సర్కిల్‌లో కలవనున్నాయి.

సపాయి కర్మచారుల జాబితాను రూపొందించండి

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 20: సర్వే నిర్వహించి సఫాయి కర్మచారుల జాబితాను రూపొందించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆర్డీవోలు, మున్సిపాల్ కమిషనర్‌లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ప్రొహిబిషన్ ఆఫ్ మ్యాన్యువల్ స్కావెంజర్స్ రిహాబిలిటేషన్ యాక్టు-2013 అమలుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలు, ఆసుపత్రులు, రైల్వేలు, శానిటేషన్ ఎక్కువగా జరిగే ప్రదేశాలలో సఫాయి కర్మచారులు ఉంటారని, సర్వే చేసి జాబితా తయారు చేయాలని ఆదేశించారు.

ఒకే చోట రెండు ప్రమాదాలు

ఏడుగురికి గాయాలు

నందికొట్కూరు, సెప్టెంబరు 20: పది పదిహేను నిమిషాల వ్యవధిలో ఒకే చోట రెండు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఈ ఘటనల్లో ఏడుగురికి గాయాలయ్యాయి. నందికొట్కూరు నుంచి నాగలూటికి వెళ్లే ద్విచక్ర వాహనదారుడిని కర్నూలు నుంచి ఆత్మకూరు వైపు వెళ్తున్న కారు నాగలూటి క్రాస్ వద్ద ఢీకొంది. దీంతో ద్విచక్ర వాహనదారుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. పగిడ్యాల మండలం నెహ్రూనగర్‌కు చెందిన వెంకటేశ్వరరాజు నాగలూటి సచివాలయంలో విద్యుత్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం విధులకు వెళ్తుండగా జాతీయ రహదారి 340-సీని క్రాస్ చేస్తుండగా కర్నూలు నుంచి వస్తున్న కారు ఢీకొంది. గాయాలు కావడంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇదే ప్రదేశంలోనే పది నిమిషాల వ్యవధిలో వ్యవసాయ పనులకు వెళ్తున్న ఆటోను బొలెరో వాహనం ఢీ కొట్టింది. నందికొట్కూరు మండలం నాగటూరుకు చెందిన 15 మంది కూలీలు మిడ్తూరు మండలం పైపాలెం గ్రామానికి వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్తుండగా ఢీ కొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న లీలావతి, వెంకటలక్ష్మమ్మ, నారాయణమ్మ, పక్కీరమ్మ, జయమ్మ, లావణ్యలతో పాటు మరికొందరికి గాయాలయ్యాయి. గాయాలపాలైన మహిళలను నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలపాలైన మరికొందరిని కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు సమాచారం. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

విద్యుత్ శాఖ ఏఈల బదిలీ

కల్లూరు, సెప్టెంబరు 20: జనరల్ బదిలీల్లో భాగంగా పలువురు విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లలను బదిలీ చేస్తూ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష రావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు కర్నూలు ఉమ్మడి సర్కిల్లో జే మధుసూదన్ ఏఈఈ కర్నూలు డీపీఈ సబ్ డివిజన్ నుంచి కర్నూలు, జి.శ్రీనివాసరెడ్డి ఏఈఈ కర్నూలు డీపీఈ-1 నుంచి కర్నూలు, కె.వెంకటక్రిష్ణయ్య ఏఈ బి.కోడూరు మండలం కడప నుంచి కర్నూలు, కె.చంద్రశేఖర్ ఏఈ డీపీఈ-1 అనంతపురం నుంయి డీపీఈ-1 ఏఈ-2 కర్నూలు, వీసీ శ్రవణ్ కుమార్‌రెడ్డి ఏఈఈ క్యాంప్స్ నుంచి డీపీఈ-1 ఏఈ-1 కర్నూలుగా బదిలీ చేస్తూ సీఎండీ ఆదేశాలు జారీ చేశారు.

ఎన్నికల షెడ్యూల్ విడుదల

కర్నూలు(అగ్రికల్చర్), సెప్టెంబరు 20: జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్‌కు గడువు తీరడంతో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు పశుసంవర్ధక శాఖ జేడీ శ్రీనివాస్, షెడ్యూల్ విడుదల చేశారు. ఎన్నికల నిర్వహణ కోసం కర్నూలు డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసన్నబాబును ఎన్నికల అధికారిగా నియమిస్తూ కలెక్టర్ పి.రంజిత్ బాషా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 23న ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను స్వీకరిస్తారని, వాటిని పరిష్కరించి ఈ నెల 24న తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తామని జేడీ శ్రీనివాస్ తెలిపారు. 26న ఎన్నికల అధికారి నోటిఫికేషన్ ఇస్తామని చెప్పారు. అక్టోబరు 5న నామినేషన్ల స్వీకరణ, 7న పరిశీలన, 8న నామినేషన్ల ఉపసంహరణకు గడువుగా నిర్ణయించినట్లు తెలిపారు. అక్టోబరు 22న 12 డైరెక్టర్ల స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. అదేరోజు డైరెక్టర్లుగా ఎన్నికైన వారితో సమావేశాన్ని నిర్వహించి చైర్మన్, వైస్ చైర్మన్లను సభ్యులు ఎన్నుకుంటారని తెలిపారు.

అన్న క్యాంటీన్లు ప్రారంభం



స్థానికులతో కలిసి అల్పాహారం చేస్తున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 20: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లను ఎమ్మిగనూరు పట్టణంలో శుక్రవారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ప్రారంభించారు. భారీ జనసందోహం మధ్య సోమప్ప సర్కిల్, శ్రీనివాస సర్కిల్‌లో ఉన్న అన్న క్యాంటీన్లు ప్రారంభం కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పలువురికి అల్పాహారం వడ్డించి వారితో కలిసి అల్పాహారాన్ని తిన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ: ఎమ్మిగనూరు పట్టణంలోని సంజీవయ్యనగర్, గోనెగండ్ల బైపాసురోడ్డు, ఎస్ఎంటీ కాలనీతో పాటు ఆయా కాలనీల్లో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీల్లో నెలకొన్న సమస్యలను అడిగి వంద రోజుల పాలన గురించి తెలుసుకున్నారు. అనంతరం ఆయా వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలకు రూ.1.20 కోట్లతో భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు.

నీతి అయోగ్ సీఈవోను కలిసిన మంత్రి భరత్



నీతి ఆయోగ్ సీఈవోకు దేవుడి బొమ్మను ఇస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 20: ఢిల్లీ పర్యటనలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రమణ్యంను కలిశారు. ఉత్పాదక రంగంలో ఆంధ్రప్రదేశ్ సాధించిన ప్రగతి, విజన్ 2047తోపాటు రానున్న ఐదేళ్లలో రాష్ట్రం అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకుంటున్న అభివృద్ధికి సంబంధించి అనేక అంశాలపై వివరంగా మాట్లాడినట్లు మంత్రి తెలిపారు. పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థను పెంపొందించడం, పెట్టుబడులను ఆకర్షించడంపై ఆయనతో జరిగిన చర్చ ఎంతో ప్రభావం చూపించిందని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో 2047 విజన్‌తో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. ఆర్థిక లోటు ఉన్నప్పటికిప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామని మంత్రి వివరించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

బనగానపల్లె , సెప్టెంబరు 20: మండలంలోని నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలుకూరు గ్రామానికి చెందిన అంగజాల ఎల్లసుబ్బయ్య(54) అనే రైతు పొలంలో సేద్యం పనులు చేయడానికి వెళ్లి ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతంతో మృతి చెందాడు. పొలంలో వ్యవసాయం చేయడానికి ఎద్దులకు ఇనుప గుంటక తగిలిస్తుండగా ప్రమాదవశాత్తూ గుంటకకు పొలంపై వెళ్తున్న విద్యుత్ వైర్లు తగిలి విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. గాయలకు గురైన ఎల్లసుబ్బయ్యను బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే ఎల్లసుబయ్య మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో మృతుడు ఎల్లసుబ్బయ్య మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మృతుని కుమారుడు ప్రభాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య శుక్రవారం తెలిపారు.

డోలమైట్ తరలిస్తున్న లారీలు సీజ్

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 20: అక్రమంగా డోలమైట్ ఖనిజాన్ని తరలిస్తున్న రెండు లారీలను సీజ్ చేసి రూ.లక్ష జరిమానా విధించామని గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం డోన్ పరిధిలో రెండు లారీలు సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించామని చెప్పారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ బాలునాయక్, సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.

ఆంధ్రజ్యోతి చిన్న ప్రకటన - పెద్ద స్పందన CLASSIFIEDS

WANTED

త్వరలో ప్రారంభించబోతున్న మౌర్య హాస్పిటల్ నందు నర్సులకు సూపరింటెండెంట్ ICU టెక్నీషియన్స్, రిసెప్షనిస్టులు, మేనేజర్, అకౌంటెంట్ Etc Post లకు గాను ఇంటర్వ్యు : 22-09-2024వ తేదీన జరుగును. సమయం : 10 am - 1 pm, Place : మౌర్య హాస్పిటల్, Opp : గాయత్రి కాలేజి, దేవనగర్, కర్నూలు. **84999 83083, 88860 77788.**
AJL-202513

కావలెను

శ్రీ కళా బోటిక్ మరియు బ్యూటీ పార్లర్‌కు అనుభవంతులైన టైలర్ మరియు బ్యూటీషియన్ కావలెను. జీతం 8K-10K వల్ల పనితనాన్ని బట్టి జీతం పెంచడం జరుగును. సంప్రదించవలసిన చిరునామా A.P. టూరిజం ఎదురుగా, వెంకటరమణ కాలనీ 2, కర్నూల్. సెల్: **984820 5089, 77023 39609.**
AJL-202555

NAME RECTIFICATION

I,**REVANUR SHAFIUN** D/O: REVANUR BABU HUSSAIN, W/O: SHAIK RAHAM TULLA Indian, Aged about 27 Years, resident of H.No: 4-198 MUGATHI village Nandavaram Mandal, Kurnool District, Andhra Pradesh do hereby solemnly affirm and state as follow. My husband passport number : W5819266 my name Shaik Shafivun. My name SSC mark's memo number LL0412244 name **REVANUR SHAFIUN** is correct. Rectify my name in my husband passport.
AJL-195666

CHANGE OF NAME

I, **KATAKAM LALITYA SAI** (Old Name) R/o. H.No: Flat No:304, 87-1109, Sai Vaibhav Colony, Ganesh Nagar, Kurnool Dist, AP., have changed my name as **KATAKAM LALITYA** (New Name) D/o.KATAKAM SURESH BABU
AJL-202704

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును. (రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: **7382114647**
AJA- 198081

WANTED

★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను/ పేషంట్లను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం 18కె సం: 9160900024/9640400073
AJH-15223

ADMISSIONS

Online SSC, ఇంటర్ (1 yr) DPP TTC, డిగ్రీ,PG, MBA & MCA కోర్సుల్లో చేరుటకు సంప్ర : శ్రీసాయి కాలేజ్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్. **KNL: 79812 23882.**
AJL-514

PLOT FOR SALE

R.R రియల్ ఎస్టేట్ వారి న్యూ లాంచింగ్ వెంచర్ అరుణాచల ఐ కాన్ సిటీ, కర్నూలు @ ఓర్వకల్ పవర్ గ్రీడ్ దాటిన తర్వాత NH హైవేకి ఆనుకొని H.కొట్టాల బస్ షెల్టర్ ఎదురుగా (26.5x50) 3 సెంట్ల ప్లాటు కేవలం 11 లక్షలకే సంప్రదించండి. A.శ్రీనివాస్. సెల్ : **91828 21014.**
AJL- 195796

CHANGE OF NAME

I, **ILIYAS** S/o.Ibrahim (Old Name) R/o. H.No: 91/4-1-1-A, Naseer Masjid Street, Balaji Nagar, Kurnool Dist, AP., Hereby State That I Have Changed My Name known as **SHAIK ILIYAS** S/o.Ibrahim (New Name)
AJL-202556

PASSPORT MISSING

I, **Kasula Subramanyam** S/o.Kasula Satya narayana, I have lost my Indian original passport bearing No:B1996956 issued at hyderabad dt:27-04-2000, has been lost by me while I was shifting my house hold items from one place to another place on 20-08-2024, I have lost my said passport. If found by any-one please inform to the address. H.No: 1/410,Near One Town Police Station, Chowk Bazar, Kurnool, Kurnool dist, AP.
AJL-202704

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన/ క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడీవిటి

చంద్రబాబుతోనే సంక్షేమం: గౌరు చరిత

కల్లూరు, సెప్టెంబరు 20: సంక్షోభంలోనూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందించడం సీఎం చంద్రబాబుకే సాధ్యమని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన వంద రోజుల పాలనలో ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు వివరించేలా ముఖ్యమంత్రి ఆదేశించారు. అందులో భాగంగా శుక్రవారం కల్లూరు మండలం కొంగనపాడులో మండల ప్రత్యేక అధికారి దీప్తి అధ్యక్షతన చేపట్టిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టీడీపీ మండల అధ్యక్షుడు డి. రామాంజనేయులు, ఉలిందకొండ టీడీపీ నాయకుడు ఈవీ. రమణ ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించి ఇంటింటికీ ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లు అతికించి అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం 16437 పోస్టులకు మోగా డీఎస్సీ ప్రకటించి నిరుద్యోగ యువతకు అండగా నిలిచిందన్నారు. అనంతరం కొంగనపాడు అభి వృద్ధికి ఎన్ఆర్ ఈజీయస్ కింద రూ.15 లక్షల నిధులను ఎమ్మెల్యే కేటాయిం చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి, వాకిటి మాదేష్, పందిపాడు శేఖర్, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.


ఓర్వకల్లు మండలం పాలకొలనులో..

కర్నూలు(అర్బన్): చంద్రబాబు నాయకత్వంలోని మంచి ప్రభుత్వంతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం నగరంలోని పలు 21 వార్డుల్లో నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, రాష్ట్ర కార్యదర్శి నంద్యాల నాగేంద్ర, మహిళా అధ్యక్షురాలు ముంతాజ్, కార్పొరేటర్లు, పరమేష్, రమణమ్మలతో కలిసి ఇంటింటికి మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం, ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు నేరవేరుస్తూ ముందుకు వెళ్తున్న తీరును ప్రజలకు వివరించారు.

గూడూరు: కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని మండల టీడీపీ అధ్యక్షుడు జే.సురేష్, కె.నాగులాపురం సర్పంచ్ జే.నయోమీ అన్నారు. శుక్రవారం గూడూరు మండలంలోని కె.నాగులాపురం గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం అనే స్టిక్కర్లను ఇంటింటికి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

సి.బెళగల్: ప్రభుత్వం ఏర్పడి వందరోజులైన సందర్భంగా మండలంలోని సంగాల గ్రామ పంచాయతీలో సర్పంచ్ అనుమంతు అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించారు. ఈవోఆర్డీ సందీప్, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఖాన్, టీడీపీ నాయకులు అనుమంతు, వెంక టేశ్వర్లు, రాముడు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: అభివృద్ధి, సంక్షేమంతో కూటమి ప్రభుత్వం ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్నదని టీడీపీ సీనియర్ నాయకుడు చదువుల సుధాకర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ చదువుల సుజాతమ్మ, చింతలపల్లె సర్పంచ్ వెంకట రమణ అన్నారు. శుక్రవారం మండలంలోని పాలకొలను, చింతలపల్లె, కొమ రోలు, సోమయాజులపల్లె గ్రామాల్లో వంద రోజుల్లో ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు కాకి దేవేంద్ర, సంజీవ, భాస్కర్ రెడ్డి, కేశవరెడ్డి, సుబ్బారెడ్డి, రవీంద్రనాథ్ పాల్గొన్నారు.


కొంగనపాడులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత


కర్నూలులో..


గూడూరులో..

టీడీపీతోనే బీసీలకు ప్రాధాన్యం


చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీసీ నాయకులు

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 20: తెలుగుదేశం పార్టీతోనే బీసీలకు ప్రాధాన్యత పెరిగిందని బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్, రాష్ట్ర కార్యదర్శి వై. నాగేశ్వరరావు యాదవ్ అన్నారు. శుక్రవారం జిల్లా తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో జిల్లా బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సత్రం రామకృష్ణ ఆధ్వర్యంలో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ పట్ల చిత్తశుద్ధి ఉన్న ఏకైన పార్టీ తెలుగుదేశం పార్టీ అన్నారు. కార్యక్రమంలో నాగరాజు యాదవ్, విజయకుమార్, సోమిశెట్టి నవీన్, బతేం క్రిష్టుడు, విజయలక్ష్మి, కె. మహేష్ గౌడ్, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టల్లో సీట్లను పెంచాలి

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 20: జిల్లాలో ఉన్న కస్తూర్బా గాంధీ, నవోదయ గురుకుల, మైనార్టీ బాలబాలికల వసతి గృహాల్లో వెనుకబడిన పశ్చిమ ప్రాంత విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని దామాషా ప్రకారం సీట్లు పెంచాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటి సభ్యులు కాకర్ల శాంతికుమార్ కోరారు. శుక్రవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవనకొండలో మూసేసిన ట్రైబల్ హాస్టల్‌ను పునరుద్దరించాలన్నారు. మరో సభ్యుడు ఎరుకల రాజు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని ప్రతి నెలా మొదటి వారంలో ఏర్పాటు చేయాలన్నారు. హొలహర్వి మండలంలో ఎస్టీలకు కమ్యూనిటీ హాల్ నిర్మించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. నగరంలోని ఏఎన్ఎం ట్రైనింగ్ సెంటర్‌కు నైట్ వాచ్‌మెన్ ఏర్పాటు చేయాలని కోరారు.

విద్యుత్ మీటర్ రీడర్లకు భద్రత కల్పించాలి

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 20: విద్యుత్ మీటర్ రీడర్లకు భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం ఏఐటీయూసీ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా విద్యుత్ మీటర్ రీడర్ల జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మునెప్ప మాట్లాడుతూ అధికారులు, కాంట్రాక్టర్ల వేధింపుల వల్ల ఐదు రోజులకే బిల్లులు కొట్టాలని మీటర్ రీడర్లపై ఒత్తిడి చేస్తున్నారని అన్నారు. రీడర్లకు ఎస్క్రో అకౌంట్ ద్వారా జీతాలు చెల్లించాలన్నారు. రీడర్లకు పీస్ రేట్లను ఎత్తివేసి కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. అనంతరం యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, యూనియన్ నాయకులు రాజు, నరసింహరెడ్డి, కోటేశ్వరరావు, మహేష్ పాల్గొన్నారు.

ప్రసాదాల నాణ్యతపై శ్వేతపత్రం విడుదల చేయాలి

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 20: తిరుమల తిరుపతి దేవ స్థానం ప్రసాదమైన లడ్డూ ప్రసాదం నాణ్యత విషయమై శ్వేతపత్రం విడుదల చేయాలని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలో కేసీ కెనాల్ వినాయక ఘాట్‌లోగల వినాయక మందిరంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుమల లడ్డూ ప్రసాద తయారీలో జంతువుల కొవ్వు నుంచి తీసిన నెయ్యి వాడారని సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పడంతో హిందూ సమాజం విపరీతంగా ఆందోళన చెందుతోందని అన్నారు.

వైసీపీ పాలకులను శిక్షించాలి

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 20: తిరుమల తిరుపతి దేవ స్థానంలో లడ్డూలను అపవిత్రం చేసిన గత వైసీపీ మంత్రి వర్గసభ్యులను కఠినంగా శిక్షించాలని ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటరామరాజు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. హిందూ భక్తుల మనోభావాలను కించపరుస్తూ, ఆగమ శాస్త్రానికి విరుద్ధంగా టీటీడీ దేవస్థానం తయారు చేసే లడ్డూలను జంతువుల కొవ్వులతో తయారు చేసిన టీటీడీ పాలక మండలిపై చర్యలు తీసుకోవాలన్నారు.

ముగిసిన వంట ఏజెన్సీల శిక్షణ

సి.బెళగల్, సెప్టెంబరు 20: మండల కేంద్రమైన సి.బెళగల్ కస్తూర్బా పాఠశాలలో మధ్యాహ్న భోజన వంట ఏజెన్సీలకు ఎంఈవో ఆదాం బాషా శిక్షణ ఇచ్చారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠ శాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారంగా అందించాలని వంట ఏజెన్సీలను ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్ఎం కిశోర్, కస్తూర్బా ఎస్‌ఓ జ్యోతి, వంట ఏజెన్సీలు పాల్గొన్నారు.

సీబీజీ ప్లాంట్‌కు స్థల పరిశీలన


సీబీజీ ప్లాంట్‌కు స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 20: గార్గేయపురం డంప్ యార్డులో ఏర్పాటు చేయనున్న కంప్రెస్ బయోగ్యాస్ ప్లాంట్ (సీబీజీ) స్థలాన్ని కమిషనర్ ఎస్.రవీంద్రబాబు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ప్రతి ఏటా టన్నుల కొద్ది వ్యర్థాలు ఉత్పత్తి అవుతుండటంతో భూమి కలుషితమై పోతుందన్నారు. దానికి పరిష్కారంగా చెత్త నుంచి బయోగ్యాస్ తయారు చేసే సీబీజీ ప్లాంట్ ఏర్పాటుకు త్వరితగతిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట ఆరోగ్య అధికారి కే.విశ్వేశ్వరరెడ్డి, ఎంఏ షాకీర్, ఏఈ దినేష్, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ శబరీష్ ఉన్నారు.

● నగరంలోని పలు వీధుల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని కమిషనర్ రవీంద్రబాబు అధికారులను ఆదేశించారు. పాతబస్టాండులో అధికారులతో కలిసి పర్యటించారు. ఆయా ప్రాంతాలలో పూడికతీత పనులు చేపట్టాలని, మురుగు కాల్వల్లో అవసరమైన నిర్మాణాలు చేపట్టాలని, ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు.

పబ్లిక్ నోటీస్
ఇందుమూలముగా యావన్మంది ప్రజానికానికి తెలియజేయడమేమనగా ఎద్దుల మహేశ్వర్ రెడ్డి S/o శివ శంకర్ రెడ్డి R/o లొద్దిపల్లి గ్రామం, ఓర్వకల్లు మండలం, కర్నూలు జిల్లా, ఏ.పి., నేను నంద్యాల చెక్‌పోస్టు నుండి మద్దూర్ నగర్‌కు ఆటోలో వెళ్తుండగా తేది. 18-09-2024 నా ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ ప్లాట్లు నెం.12 సర్వేనెంబరు 653 యల్.పి.నెం. 417/82, డాక్యుమెంట్ నెం.7347/1984 గల డాక్యుమెంట్ పడిపోయినది. కావున పై నెంబరు గల డాక్యుమెంట్ ఎవరికైన దొరికిన యెడల దీనిపైన జరుగు క్రయ, విక్రయాలు చెల్లనేరవని యావన్మంది ప్రజానికానికి తెలియజేయడమైనది. సదరు డాక్యుమెంట్ ఎవ్వరికైన దొరికినచో ఈ క్రింద తెలిపిన అడ్వకేటు గారికి అందజేయగలరు.
SMd. AJAZ, B.A.B.L. Advocate.
Kurnool, Cell: 9848508063

సభ్యత్వ నమోదు పొడిగింపు

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 20: నగర బ్రాహ్మణ సంఘానికి త్వరలో ఎన్నికలు నిర్వహిస్తున్న సందర్భంగా శుక్రవారం వరకు ఉన్న సభ్యత్వ నమోదు గడువును శనివారం వరకు పొడిగించినట్లు సంఘ ఎన్నికల అధికారి జి. శేషాద్రి ఒక ప్రకటనలో తెలిపారు. కల్లూరు, కర్నూలు పరిధిలో ఉన్న బ్రాహ్మణులంతా సంఘంలో సభ్యత్వం తీసుకోవాలన్నారు.

మొక్కలు నాటండి: కలెక్టర్


మొక్క నాటుతున్న కలెక్టర్, ఎమ్మెల్యే, ఎంపీ

కర్నూలు(రూరల్), సెప్టెంబరు 20: ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కలెక్టర్ రంజిత్‌బాషా విద్యార్థులకు సూచించారు. కర్నూలు రూరల్ మండలం బి.తాండ్రపాడు గ్రామంలోని డైట్ కళాశాల యందు శుక్రవారం స్వచ్ఛతా హిసేవా కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొక్కలు నాటి పెంచడం వలన ఆక్సిజన్ సమృద్ధిగా అందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో నాసరరెడ్డి, డ్వామా పీడీ అమర్నాథరెడ్డి,డీపీఓ నాగరాజునాయుడు, పీఆర్ ఏఈ రవిమోహన్‌రెడ్డి ఎంపీడీవో అనురాధ పాల్గొన్నారు.

ఆర్‌యూలో స్వచ్ఛతా హి సేవా

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 20: రాయలసీమ యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఆధ్వర్యంలో శుక్రవారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఉపకులపతి ఎన్‌టీకే నాయక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలన్నారు. అనంతరం వర్సిటీ ఆవరణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీఈ వెంకటేశ్వర్లు, ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం అధి కారి ఎస్ నాగచంద్రుడు, బీవీ శివప్రసాదరెడ్డి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

కర్నూలు(న్యూసిటీ): మొక్కల సంరక్షణతోనే మనుగడ సాధ్యమవుతుందని కమిషనర్ రవీంద్రబాబు తెలిపారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ అతిథి గృహంలో కమిషనర్ మొక్కలు నాటారు. డీఈ నరేష్, డీపీఆర్‌ఓ వెంకటలక్ష్మి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ముర్తు జావలి ఉన్నారు.

● విజయపురి కాలనీ పార్కులో మెగా ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఎంఈ శేషసాయి, డీఈ నరేష్, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ మునిప్రసాద్, సైంటిస్టు గణేష్‌లు మొక్కలు నాటారు.

ఎమ్మెల్యే గౌరు చరితను కలిసిన కమిషనర్


ఎమ్మెల్యే గౌరు చరితకు పూలబొకే ఇస్తున్న కమిషనర్

కల్లూరు, సెప్టెంబరు 20: కర్నూలు నగరపాలక సంస్థ నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన రవీంద్రబాబు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితను మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం మాదవీ నగర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో గౌరు చరితకు పూలబోకే అందించారు.

కర్నూలు(కల్చరల్): నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్ రవీంద్రబాబు శుక్రవారం కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిలను వారివారి నివాసాల్లో మర్యాద పూర్వకంగా కలి శారు.

● వరద బాధితులకు విరాళం: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సేకరించిన విరాళాన్ని 28వ వార్డు పందిపాడు టీడీపీ నాయకులు గౌరు దంపతులకు అందజేశారు. శుక్రవారం మాధవీనగర్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో కర్నూలు మార్కెట్ యార్డ్ మాజీ ఉపాధ్యక్షుడు కూరపాటి దేవేంద్రారెడ్డి, గూడూరు శేఖర్‌చౌదరి రూ.2లక్షలను గౌరు దంపతులకు అందజేశారు.

మండల స్థూల ఉత్పత్తి పెంచాలి

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 20: జిల్లాలోని మండలాల స్థూల ఉత్పత్తి పెంచడానికి చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ బి.నవ్య మండల అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జేసీ అన్ని మండలాల అధికారులతో వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రణాళిక అధికారి హిమప్రభాకర్ రాజు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ వర్క్‌షాపులో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, సీఈవో నాసరరెడ్డి తదితరులు ఉన్నారు.

ఎస్టీపీ నిర్మాణానికి స్థల పరిశీలన

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 20: అమృత్ పథకం 2.0లో భాగంగా నగరానికి మంజూరైన మురుగునీటి శుద్ధి కేంద్రం (ఎస్టీపీ) ఏర్పాటుకు సంబంధించి రెండు ప్రదేశాలను కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు పరిశీలించారు. శుక్రవారం నగర పాలక, పబ్లిక్ హెల్త్ అధికా రులతో కలిసి సుంకేసుల రోడ్డులో తుంగభద్ర నది ఒడ్డున ఉన్న పాత పంప్‌హౌస్, హిందూ శ్మశాన వాటికలను ఆయన పరిశీలించారు. రూ.1.35 కోట్లతో చేపట్టాల్సి ఎస్టీపీ నిర్మాణానికి అనువైన ప్రదేశాన్ని ఎంపికకు సంబంధించి సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈ శేషసాయి, పబ్లిక్ హెల్త్ ఈఈ మురళీ మోహన్, ఏసీపీ రంగస్వామి, శబరీష్, ఏఈలు పాల్గొన్నారు.

రైతులకు పూర్తి స్థాయిలో సాగునీరు ఇవ్వాలి

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 20: హంద్రీ నీవా ప్రధాన కాలవకు తూము ఏర్పాటు చేసి ఆలూరు బ్రాంచ్ కెనాల్ ఆయకట్టు రైతులకు పూర్తిస్థాయిలో పంటలకు సాగునీరు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆలూరు నియోజకవర్గంలోని చిప్పగిరి, హాలహర్వి, ఆలూరు మండలాల్లో 14265 ఎకరాలకు సాగునీరు రాక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. మునెప్ప, కార్యవర్గసభ్యులు కే. జగన్నాథం, పి. రామక్రిష్ణారెడ్డి, వి. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

కల్లూరు, సెప్టెంబరు 20: గత ఎన్నికల్లో ఎన్‌డీఏ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కల్లూరు సూర్యనారాయణ భవన్‌లో సీపీఎం నగర కమిటీ సభ్యుడు సీహెచ్.సాయిబాబా అధ్యతన చేపట్టిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో నాయకులు పి.నిర్మల, టి.రాముడు పాల్గొన్నారు.

నాణ్యత లోపం

» మూణ్నాళ్ల ముచ్చటగా కోడుమూరు-గూడూరు రోడ్డు
» కాంట్రాక్టర్, అధికారులపై ప్రజల ఆగ్రహం

కోడుమూరు, సెప్టెంబరు 20: ఇటీవల వేసిన కోడుమూరు-గూడూరు రహదారి నాణ్యత లోపించింది. రోడ్డు నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు, అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించి రోడ్డును వేశారు. రోడ్డు వేసిన 20 రోజులకే అక్కడక్కడ పెచ్చులు లేసిపోవడంతో కాంట్రాక్టర్, అధికారులు తప్పును కప్పి పుచ్చుకొనేందుకు శుక్రవారం రోడ్డుకు ప్యాచ్ పనులు చేపట్టారు. శిథిలమైన రోడ్డును తిరిగి 20 సంవత్సరాల అనంతరం రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడం పట్ల గూడూరు, కోడుమూరు, చనుగొండ్ల ప్రజలు ఎంతో సంతోషించారు. అధికారులు పర్యవేక్షణ లోపం కారణంగా రోడ్డు నిర్మాణ పనులు నాసిరకంగా జరిగాయని ప్రజలు విమర్శలు వ్యక్తం చేశారు. కాసులకు కక్కుర్తికి పడ్డ అధికారులపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించడం లేదని మొదటి నుంచి ప్రజలు ఆరోపణలు చేసి ధర్నాలు కూడా చేపట్టారు. ఇవేవి పట్టించుకోని అధికారులు చకచక రోడ్డు పనులు పూర్తి చేసి చేతులు దులుపుకున్నారు. రూ.6.79కోట్ల వ్యయంతో పీఐయూ అధికారులు పర్యవేక్షణలో వేసిన రోడ్డు మూణ్నాళ్ల ముచ్చటగా మారిందని ప్రజలు విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 2030 వరకు రోడ్డు నాణ్యత ప్రమాణాలను సదరు కాంట్రాక్టరు కాపాడాలి. కానీ 20 రోజులకే రోడ్డు రోడ్డు శిథిలం కావడం అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందని ప్రజా సంఘాల నాయకులు విమర్శలు గుప్పిస్తున్నారు.


దెబ్బతిన్న రోడ్డుకు వేసిన ప్యాచ్‌లు

శ్రద్ధగా చదువుకోవాలి: ఎస్ఐ


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎస్ఐ

కోడుమూరు, సెప్టెంబరు 20: విద్యార్థులు శ్రద్ధగా చదువుకుంటే అనుకొన్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని ఎస్ఐ ఏపీ శ్రీనివాసులు అన్నారు. స్థానిక వివేకానంద డిగ్రీ కళాశాలలో స్వాగతోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా దేశభక్తి, క్రమ శిక్షణ కల్గి ఉండాలని అన్నారు. ఈ సంద ర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం గోట్ల శేఖర్, విజయకుమార్ అధ్యాపకులు వీరేష్, బాలస్వామి, ఆంజనేయులు, నాగరాజు, భాస్కర్ పాల్గొన్నారు.

అవయవదానంతో జీవితాల్లో వెలుగు

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 20: అవయవ దానంతో జీవితాల్లో వెలుగులు నింపవచ్చని ఏడో అడిషినల్ జిల్లా న్యాయాధికారి జి.భూపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరి యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, కిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవయవదానం, పీసీ, పీఎన్‌డీటీ చట్టాల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ అవయవ దానంపై ప్రజల్లో అవగాహన మరింత పెరగాలన్నారు. కార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, పత్తికొండ ఆర్డీవో రామలక్ష్మి పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

కోడుమూరు, సెప్టెంబరు 20: ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మలేరియా అధికారి నూక రాజు అన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పలు వీధులను సందర్శించి ప్రజలతో మాట్లాడారు. దోమల కాటుతో మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, మెదడువాపు వంటి రోగాల వ్యాప్తి చెందుతాయన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సిబ్బంది నరసప్ప, కమాల్ సాహెబ్ పాల్గొన్నారు.

షూటింగ్ బాల్ జాతీయ క్రీడా దినోత్సవం

కర్నూలు(స్పోర్ట్స్), సెప్టెంబరు 20: పట్టణంలోని విఠల్ నగర్‌లో ఉన్న గుడ్ షప్పర్డ్ పాఠశాల క్రీడా మైదానంలో జాతీయ షూటింగ్‌బాల్ క్రీడాదినోత్సం శుక్రవారం ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథులుగా డీఎస్‌డీవో భూతిరావు, క్రీడాదాత న్యాయవాది శ్రీధర్ రెడ్డి హాజరై కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పరుశురాముడు, జిల్లా ఒలింపిక్ అసోసియేసన్ అధ్యక్షుడు రామాంజనేయులు, నాగరాజు, హర్షవర్దన్, ప్రభాకర్, సుభాన్‌బాషా పాల్గొన్నారు.

క్రీడలతో ఏకాగ్రత

కర్నూలు(స్పోర్ట్స్), సెప్టెంబరు 20: క్రీడలతో విద్యార్థుల్లో ఏకాగ్రత పెరుగుతుందని కర్నూలు ఉప విద్యాశాఖ అధికారి హనుమంతరావు అన్నారు. శుక్రవారం స్థానిక అవుట్‌డోర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ కర్నూలు మండలం నుంచి అండర్-17 బాలబాలికల ఎంపిక పోటీలను ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ ఆదేశాల మేరకు మండలం, నియోజకవర్గ స్థాయిలో పోటీలు నిర్వహించి మధ్యాహ్నం భోజనం విద్యార్థులకు అందజేస్తామన్నారు. అనంతరం విజేతలను అభి నందించారు. ఈ కార్యక్రమంలో ఎం.విజయకుమార్, ఎం.పుల్లన్న, పీడీ, కోచ్‌లు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 20: కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వ్యవసాయ అనుబంధ శాఖలకు సంబంధించిన పొలం పిలుస్తోంది పోస్టర్లను కలెక్టర్ పి.రంజిత్ బాషా శుక్రవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయం లాభసాటిగా మార్చేందుకే రాష్ట్ర ప్రభుత్వం పొలం పిలుస్తోంది అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర మౌర్య భరద్వాజ్, సీపీవో హిమప్రభాకర్ రాజు, జిల్లా వ్యవ సాయాధికారి వరలక్ష్మి, పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, సెప్టెంబరు 20: విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా బి.క్యాంప్ సెక్షన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు డివిజన్ ఈఈ టి.శేషాద్రి గురువానం ఒక ప్రకటనలో తెలిపారు. మూడో శనివారం మెయింటెనెన్స్‌లో భాగంగా ఉద యం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్‌కోత ఉంటుందని ఏడీఈ రాజేంద్రబాబు తెలిపారు. గణేష్‌నగర్, రామ చంద్రమిషన్, రెవెన్యూ కాలనీ, సోమిశెట్టినగర్, మదర్‌ల్యాండ్, సాయివైభవ్ నగర్, జంపాల అపార్ట్‌మెంట్, ఫోర్త్‌క్లాస్ ఎంపాయిస్ కాలనీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

ప్రైవేటీకరణ ఆలోచనలను వెనక్కి తీసుకోవాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 20: రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆలోచనలను వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక సుందరయ్య సర్కిల్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప అధ్యక్షతన నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో కొత్తగా నిర్మిస్తున్న మెడికల్ కాలేజీ సీట్లను ప్రభుత్వం నిర్వహించలేదని ఎన్ఎంసీకి లేఖ రాయడం దారుణమని అన్నారు.

మొక్కలు నాటుదాం... ప్రగతిని పెంచుదాం

సి.బెళగల్, సెప్టెంబరు 20: మొక్కలు నాటుదాం.. ప్రగతిని పెంచుదామని ఈవోఆర్డీ సందీప్ అన్నారు. సి.బెళగల్ ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపాల్ వంశీకృష్ణ అధ్వర్యంలో శుక్రవారం పాఠశాల అవరణలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఈవోఆర్డీ సందీప్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు, గ్రామ సర్పంచ్ పాండురంగన్న, టీడీపీ నాయకులు బాలాజివెంకటేశ్, ధనుంజయుడు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ విద్యలో ముందుండాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 20: ప్రత్యేక అవసరాల గల పిల్లలు డిజిటల్ విద్యలో ముందుండాలని రాష్ట్ర సమగ్ర శిక్ష ఐఈ కోఆర్డినేటర్ అమ్మి, రాష్ట్ర పరిశీలకులు కల్పన శైలా తెలిపారు. శుక్రవారం జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో స్థానిక ఏ.క్యాంపులోని హార్ట్‌హెల్త్ ఫౌండేషన్ భవనంలో జిల్లాలోని భవిత కేంద్రాలలో పని చేసే ఐఈఆర్‌టీలకు డిజిటల్ విద్యపై ట్యాబ్‌ల వినియోగంపై వర్క్‌షాపు శిక్షన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల పిల్లలకు డిజిటల్ విద్యను ఏవిధంగా బోధించాలో క్లుప్తంగా ఐఈఆర్‌టీలకు వివరించారు.

బీజేపీ సభ్యత్వ నమోదు ప్రారంభం

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 20: నగరంలోని 45, 46 వార్డు అశోక్‌నగర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగరూరు రాఘవేంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ముందుకు పోతోందన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ప్రతిపక్ష నేతలు విషప్రచారం చేస్తున్నారన్నారు. కార్యక్ర మంలో బీజేపీ జిల్లా కోశాధికారి లోకేశ్వరయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరాములు యాదవ్, నగర ఓబీసీ మోర్చా అధ్యక్షుడు విజయకుమార్, శ్రీనివాసులు, శివ పాల్గొన్నారు.

15 సెల్ ఫోన్లు రికవరీ

సి.బెళగల్, సెప్టెంబరు 20: మండలంలోని సెల్ ఫోన్లు 15 రికవరీ చేసినట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలోని బ్రాహ్మణదొడ్డి, పోలకల్లు, గుండ్రేవుల, శింగవరం, తిమ్మనదొడ్డి, చింతమానుపల్లె, సి.బెళగల్, ముడుమాల గ్రామాలలో సెల్ ఫొన్లు పోయినవి తిరిగి యజమానులకు అప్పగించినట్లు తెలిపారు.

నేటి నుంచి ఇన్‌ఫెర్టిలిటీ రాష్ట్ర సదస్సు


బ్రోచర్లను విడుదల చేస్తున్న డాక్టర్లు

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 20: ఏపీ ఇండియన్ సొసైటీ ఫర్ అసిస్టెంట్ రీప్రొడెక్టువ్ స్టేట్ కాన్ఫరెన్స్ కర్నూలు మౌర్య ఇన్ హోటల్‌లో ఈనెల 21, 22 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ ఛైర్‌పర్సన్ డాక్టర్ విష్ణుప్రియ, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ విజయలక్ష్మి వెల్లడించారు. శుక్రవారం నగరంలోని గాయత్రీ ఎస్టేట్స్‌లోని విష్ణుప్రియ టెస్ట్‌ట్యూబ్ సెంటరులో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత ఏపీ మొట్టమొదటి ఇన్‌ఫెర్టిలిటి రాష్ట్ర సదస్సు జరగుతుంద న్నారు. ఈ సదస్సుకు ఇండోర్‌కు చెందిన జాతీయ కార్యదర్శి డాక్టర్ ఆశా బక్షి, రాష్ట్ర అధ్యక్షురాలు పద్మలత యరాసి, కార్యదర్శి ప్రమోద రెడ్డి, హాజరవుతారన్నారు. ముఖ్యఅతిథులుగా ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, టీజీ భరత్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత హాజరవుతారని అన్నారు. సంతానలేమికి అత్యాధునిక పద్ధతులు అందుబాటులో వచ్చాయని, వీటి గురించి సదస్సులో చర్చించనున్నట్లు వారు తెలిపారు. సమావేశంలో ఆర్గనైజింగ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు డాక్టర్లు శ్రావయ్య, శిరీషారెడ్డి, భార్గవి పాల్గొన్నారు.

కొనసాగుతున్న వైద్యుల సమ్మె

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 20: పీజీ వైద్య విద్యాలో ప్రవేశించేందుకు ఇన్‌సర్వీస్ కోటాను తగ్గిస్తూ జారీ చేసిన జీవో.నెం.85ను సవరించాలని కోరుతూ ఏపీ పీహెచ్‌సీ డాక్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట పీహెచ్‌సీ వైద్యులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు డా. రఘురామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఇన్‌సర్వీస్ కోటాను కుదిస్తూ జారీ చేసిన జీవోను రద్దు చేసే వరకు సమ్మె విరమించ బోమని తేల్చి చెప్పారు. డీఎంహెచ్‌వో డా.ఎల్. భాస్కర్‌ను కలిసి అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డా. రఘురామిరెడ్డి, డా. అరుణ్, కోశాదికారి డా.పరిమళ, వైస్ ప్రెసిడెంట్ డా.రేఖ, స్టేట్ జాయింట్ సెక్రటరీ హరిచంద్రుడు, పీహెచ్‌సీ వైద్యులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులో రూ.5కు భోజనం

● మార్కెట్ యార్డు కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి



మార్కెట్ యార్డులో భోజన శాలను పరిశీలిస్తున్న కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 20: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో 26 నుంచి సూచి శుభ్రతతో కూడిన పౌష్టికార షైన ఆహారాన్ని రూ.5కే వడ్డి స్తామని మార్కెట్ యార్డు కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం యార్డులోని భోజనశాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా ఇస్కాన్ సంస్థతో కలిసి రైతులకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నామన్నారు. ఈ ఏడాది అన్నా క్యాంటీన్ తరహాలో రైతులకు రూ.5 అందిస్తామన్నారు. రోజుకు 1,200 నుంచి 1,500 మంది రైతులు పైగా భోజనం చేసే అవకాశాన్ని కల్పిస్తామన్నారు. ఇప్పటికే ఇస్కాన్ సంస్థతో మాట్లాడమని, ఎమ్మెల్యే పార్థసారథి కాశ్మీర్ పర్యటన ముగించుకొని వచ్చిన వెంటనే భోజన పథకాన్ని ప్రారంభిస్తామన్నారు. ఆయన వెంట సహాయ కార్యదర్శి శాంత కుమార్, సూపర్‌వైజర్ మోహన్‌రెడ్డి, అశోక్ ఉన్నారు.

సీఐటీయూ నాయకుడి మృతి

వెల్దుర్తి, సెప్టెంబరు, 20: సీఐటీయూ మండల నాయకుడు ఏ. రాముడు గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. పట్టణంలో తన ఇంటిలో ఛాతి నొప్పి రావడంతో కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, జిల్లా నాయకులు నగేష్ పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోవాలి

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 20 : వైద్య విద్యను ప్రైవేటీకరించే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ, కార్యదర్శి మహేంద్ర బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం పీడీఎస్‌యూ నాయకులు విద్యార్థులతో కలిసి ఆర్ట్స్ కళాశాల ప్రధాన రహదారిపై ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ కొత్తగా ప్రారంభించిన 17 వైద్య కళాశాలలో ఐదు వైద్య కళాశాలలు ఏడాది ప్రారంభం కావాల్సి ఉండగా కూటమి ప్రభుత్వం కళాశాల నిర్మాణాలను నిలిపివేయడం అన్యాయమన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి 700 మెడికల్ సీట్లు ప్రభుత్వ విధానాల వల్ల కోల్పోయామని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పునః ఆలోచించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామన్నారు. నాయకులు మహేష్ రవి పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబర్ 20 : రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం బీసీ,ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నరసన్న యాదవ్, డీఎస్‌వైఏ వెంకటేష్ మాట్లాడుతూ 2023-2024 విద్యా సంవత్సరానికి సంబంధించి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రాక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. గత ప్రభుత్వం విడుదల చేయని రీయింబర్స్‌మెంట్ బకాయిలను కూడా కూటమి ప్రభుత్వం విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని కోరారు. ఽ

మాజీ సర్పంచ్ కొత్తపేట గిరమ్మరెడ్డి మృతి



గిరమ్మరెడ్డి (ఫైల్)

మద్దికెర, సెప్టెంబరు 20: మద్దికెరకు చెందిన మాజీ సర్పంచ్ కొత్తపేట వెంకటరెడ్డి కుమారుడు మాజీ సర్పంచ్ కొత్తపేట సుదర్శన్ రెడ్డి భార్య కొత్తపేట గిరమ్మరెడ్డి (84) శుక్రవారం మృతి చెందారు. మద్దికెర గ్రామంలో ఎన్నో సేవా కార్యక్రమాలతోపాటు దాదాపు 60 ఏళ్ల పాటు మద్దికెర గ్రామ పంచాయతీ సర్పంచుగా వారి కుటుంబీకులు పని చేశారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాలకు ఉచితంగా స్థలాలు విరాళంగా ఇచ్చారు. మండలంలోని టీడీపీ, వైసీపీ, సీపీఐ నాయకులు, ప్రజలు ఆమె భౌతికాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● కొత్తపేట గిరమ్మరెడ్డి డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సన్నిహిత బంధువులు కావడంతో కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, కేడీసీసీ బ్యాంకు మాజీ వైస్ చైర్మన్ రామచంద్రరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర కుటుంబ సభ్యులైన మాజీ సర్పంచ్ కొత్తపేట వెంకటేశ్వరరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాస రెడ్డిలను పరామర్శించి ఓదార్చారు.

డోన్ ఎమ్మెల్యేను కలిసిన తుగ్గలి నాగేంద్ర

తుగ్గలి, సెప్టెంబరు 20: డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని తుగ్గలిలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర శుక్రవారం కలిసి శాలువ కప్పి పూల మాలతో సన్మానం చేశారు. ఎమ్మెల్యే కోట్లను మర్యాదపూర్వకంగా కలిసి టీడీపీ అభివృద్ధిపై పలు విషయాలు చర్చించినట్లు ఆయన తెలిపారు.



కోట్లను సత్కరిస్తున్న తుగ్గలి నాగేంద్ర

ఏడేళ్ల బాలికకు డెంగీ

దేవనకొండ, సెప్టెంబరు 20: మండలంలోని వెంకటాపురంలో ఏడేళ్ల బాలికకు డెంగీ లక్షణాలను గుర్తించినట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయిబాబా తెలిపారు. గ్రామంలో దోమల నివారణకు చర్యలు చేపట్టారు. నీటి నిల్వలను గుర్తించి గ్రామస్తులకు సూచనలు ఇచాచరు. ప్రజలు జ్వరం బారిన పడితే వైద్యశాలలో రక్తపరీక్షలు చేయించుకోవాలన్నారు. సూపర్‌వైజర్ రంగస్వామి, వైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉంటాం.. అధైర్యపడొద్దు

పత్తికొండ, సెప్టెంబరు 20 : పత్తికొండ మండల పరిధిలోని హోసూరు గ్రామంలో కొద్దిరోజుల క్రితం దారుణ హత్యకు గురైన టీడీపీ నాయకుడు వాకిటి శ్రీనివాసులు కుటుంబాన్ని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు పరామర్శించారు. శుక్రవారం గ్రామానికి చేరుకున్న ఆయన శ్రీను ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అండగా ఉంటామని, అన్ని విధాల ఆదుకుంటామని శ్రీను భార్య శారదమ్మకు ధైర్యం చెప్పారు.

మద్యం పట్టివేత

క్రిష్ణగిరి, సెప్టెంబరు, 20: మండల పరిధిలోని ఎరుకలచెరువు గ్రామ సమీపంలోని పెనుమాడ క్రాస్ రోడ్డు వద్ద అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. ఎరుకలచెరువు గ్రామానికి చెందిన కులుమాల శ్రీవర్ధన్, నవీన్ కుమార్, చెరుకులపాడు గ్రామానికి చెందిన డొల్ల హరిబాబు, దమ్మిడి బలరాముడు, దేవనకొండ మండలం బేతపల్లెకు చెందిన రవి, కర్ణాటక రాష్ట్రానికి చెందిన మద్యం ప్యాకెట్లు తెచ్చుకొని అమ్ముతుండగా వారి వద్ద నుంచి పట్టుకొని వారి వద్ద ఉన్న ఆరు బాక్సులలో గల 576 ఒరిజినల్ చాయిస్, డీలక్స్ విక్సి 90 ఎం.ఎల్. టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

బండలాగుడు విజేత చౌటుపల్లి వృషభాలు

క్రిష్ణగిరి, సెప్టెంబరు, 20: పుట్లూరు మారెమ్మ జాతర సందర్భంగా నిర్వహించిన బండలాగుడు పోటీలలో కడప జిల్లా ప్రొద్దుటూరు మండలం చౌటుపల్లి గ్రామానికి చెందిన మార్తాల చంద్ర ఓబులరెడ్డి వృషభాలు మొదటి స్థానంలో నిలిచి రూ.70 వేలు గెలుపొందాయి. శుక్రవారం జరిగిన బండలాగుడు పోటీలలో 13 జతలు పాల్గొన్నాయి. ద్వితీయ స్థానంలో మార్తాల చంద్ర ఓబులరెడ్డి వృషభాలు, తృతీయ స్థానంలో నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం పి.ఆర్.పల్లె గ్రామానికి చెందిన నాగయ్య వృషభాలు, నాలుగో స్థానంలో వైఎస్సార్ జిల్లా మైదుకూరుకు చెందిన కుర్ర వెంకటేష్ యాదవ్ వృషభాలు, ఐదో స్థానంలో అనంతపురం జిల్లా నారాయణపురం గ్రామానికి చెందిన షేక్.మహబుబ్ బాషా వృషభాలు నిలిచాయి. వరుసగా రూ.60వేలు, రూ.50వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు గెలుపొందాయి. నగదు బహుమతులను ఎద్దుల యజమానులకు గ్రామపెద్దలు అందించారు.



హోసూరు గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు



మంత్రాలయం: చెట్నహళ్లిలో వంద రోజుల ప్రభుత్వంపై పోస్టర్ అందజేస్తున్న రాఘవేంద్రరెడ్డి, నాయకులు



హాలహర్విలో మాట్లాడుతున్న వీరభద్రగౌడ్

చంద్రబాబు పాలన ఆదర్శం

ఘనంగా వంద రోజుల పాలన కార్యక్రమాలు

పత్తికొండ, సెప్టెంబరు 20 : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆశయాలే ఆదర్శంగా తీసుకుని నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతానని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. కూటమి ప్రభుత్వం వందరోజులు ప్రజాపాలనను పురస్కరించుకుని పత్తికొండ మండలంలోని హోసూరు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా గ్రామంలో పర్యటించిన ఆయన ఇదిమంచి ప్రభుత్వం స్టిక్కర్లను ఇంటింటికి తిరిగి అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన నాటికి నిధుల కొరత ఉన్నప్పటికి ఒక్కరూపాయి అప్పు చేయకుండా నిధులు సృష్టిస్తూ ఇటు ప్రజాపాలన అటు సంక్షేమ పథకాల అమలు చేస్తూ ముందుకు సాగుతున్నారన్నారు. గ్రామం విషయానికి వస్తే గ్రామం కోసం అనుక్షణం కష్టపడే నాయకుడు నాకు తమ్ముడు వంటివాడు వాకిటి శ్రీనివాసులు హత్యకు గురికావడం బాధాకరమన్నారు. గ్రామాన్ని అన్నివిధాల అభివృద్ధి చేసే బాధ్యత తానుతీసుకుంటున్నానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, రామానాయుడు, ఎంపీడీవో కవిత, ఏపీఎం మధుబాబులతోపాటు పలువురు నాయకులు కార్యకర్తలు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

పేదలకు సంక్షేమందించే మంచి ప్రభుత్వం

హాలహర్వి, సెప్టెంబరు 20 : పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించే వారిని అభివృద్ధి పథంలో నడిపించే మంచి ప్రభుత్వమని తెదేపా సీనియర్ నాయకులు వీరభద్ర గౌడ్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వందరోజుల మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వంద రోజుల్లోనే ప్రజలకు ఆనేక విజయాలు సాధించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లికార్జున, మండల కన్వీనర్ సుధాకర్, క్లస్టర్ ఇన్‌చార్జి ప్రహల్లదరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఆస్పరి: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను 100 రోజుల పాలనలో నెరవేర్చారని టీడీపీ మండల కన్వీనర్ పరమారెడ్డి, మాజీ ఎంపీపీ కృష్ణ యాదవ్, టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి ముత్యాల రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఆస్పరి, చిగిలి, శంకరబండ గ్రామాల్లో వంద రోజుల పాలన గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచులు మూలింటి రాధమ్మ, విజయలక్ష్మి, ఎమ్మార్వో శివశంకర్ నాయక్, మాజీ మండల కన్వీనర్ రామాంజినేయులు, ఎంఈవో తిరుమలరావు, ఎంపీడీవో రాణమ్మ, సంజప్ప, పురుషోత్తం రెడ్డి, సతీష్ కుమార్, అరవిందు, నాగేంద్ర, అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

మంత్రాలయం: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే రాష్ట్ర అభివృద్ధి చెందుతుందని మంత్రాలయం నియోజకవర్గ టీడీపీ నాయకులు రాఘవేంద్రరెడ్డి, మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య, తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి చావిడి వెంకటేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని చెట్నహళ్లి గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం వంద రోజుల్లో చేసిన అభివృద్ధి, చేసే అభివృద్ధి పనులను ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అశోక్ రెడ్డి, ఎస్ ఎం గోపాల్ రెడ్డి, ఎంపీడీవో మణిమంజరి, మండల వ్యవసాయాధికారి జీరగణేష్, జనసేన నాయకులు చిన్న, వరదరాజు, టీడీపీ నాయకులు మేకల మల్లేష్, నగేష్, పెద్దలక్ష్మయ్య, గోపాల్, మల్లేష్, వీరేష్, వెంకట్రాముడు, లక్ష్మన్నపాల్గొన్నారు.

కోసిగి: కోసిగిలో వంద రోజుల కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ హరున్ రషీద్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు ముత్తురెడ్డి, మండల కన్వీనర్ జ్ఞానేష్‌లు, మాజీ జడ్పీటీసీ రామకృష్ణ, నాడిగేని అయ్యన్న, వక్రాణి వెంకటేష్, వీరేష్, వీఆర్వో లింగన్న, మహిళా పోలీసు దేవి, వెల్ఫేర్ అసిస్టెంట్ గ్రీష్మ, పంచాయితీ సిబ్బంది రంగస్వామి, రాజేష్, టీడీపీ నాయకులు పులుసు శివన్న, మూకయ్య తదితరులు ఉన్నారు.

పెద్దకడుబూరు: మండలంలోని తారాపురం గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని అధికారులు, నాయకులు శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 రాంమూర్తి, టీడీపీ నాయకులు మల్లికార్జున, గ్రామ సర్పంచ్ రామాంజినేయులు, బొగ్గుల తిక్కన్న, తలారి అంజి, బొగ్గుల బాషా, ఆంజి నరసన్న, మంచోది రామన్న, ఆంజినేయులు పాల్గొన్నారు.

తుగ్గలి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి అందించిన వంద రోజుల మంచి పరిపాలన బాగుందని ప్రజలు సంతోషం వ్యక్తం చేశారని టీడీపీ జిల్లా రైతు సంఘం నాయకులు మనోహర్ చౌదరి, సర్పంచ్ విజయలక్ష్మి, మధుబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని గిరిగిట్ల, రాతన, ఎద్దులదొడ్డి తదితర గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి స్టిక్కర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి శివకుమార్, నాయకులు ఎద్దులదొడ్డి శ్రీనివాసులుగౌడు, సర్పంచ్ విజయుడు, గిరిగిట్ల మల్లి, సత్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రజా వేదిక కార్యక్రమాలు

ఆదోని టౌన్ : వంద రోజుల ప్రభుత్వ పాలనలో సాధించిన విజయాలపై ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా శనివారం నుంచి సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరిస్తారని మునిసిపల్ ఇన్‌చార్జి కమిషనర్ డా. అనుపమ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఆరు రోజుల పాటు వివిధ వార్డులలో ప్రజావేదిక కార్యక్రమాలను నిర్వహించి ప్రభుత్వ పాలనపై వివరించడం జరుగుతుందన్నారు. 21న జీవేశ్వరా హై స్కూల్ మైదానంలో, 22న మునిసిపల్ మైదానంలో, 23న యన్‌జీఏస్ కాలనీ మైదానంలో, 24న గుల్షన్ ఫైల్వాన్ దర్గా మైదానంలో 25న శంకర్ నగర్ సచివాలయంలో 26న వైయంకే హై స్కూల్ మైదానంలో కార్యక్రమాలను నిర్వహిస్తామని ఆమె తెలిపారు.



పట్టణంలోని 33వ వార్డు సంజీవయ్యనగర్‌లో భూమి పూజ చేసి సీసీరోడ్లు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీవీ



పెద్దకడుబూరు మండలంలో..



శంకరబండలో మంచి ప్రభుత్వం గురించి వివరిస్తున్న టీడీపీ నాయకులు



గిరిగిట్లలో ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు, అధికారులు



కోసిగిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకులు, అధికారులు

తూతూ మంత్రంగా కౌన్సిల్ సమావేశం

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 20: ఎమ్మిగనూరు మున్సిపల్ సమావేశం తూతూ మంత్రంగా జరిగింది. శుక్రవారం మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ రఘు అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించగా అజెండాలోని 8 అంశాలను సభ్యులు ఆమోదించారు. అనంతరం ఫ్లోర్ లీడర్ దయాసాగర్ మాట్లాడుతూ వంద రోజుల టీడీపీ పాలనలో ఎమ్మిగనూరు పట్టణంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారన్నారు. అయితే పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎలాంటి చర్చలేకుండా కౌన్సిల్ సమావేశం ముగియడం విమర్శలకు దారితీస్తుంది. ఇదిలా ఉండగా కౌన్సిల్ సభ్యులంతా వరద బాధితుల సహాయార్థం ఒక నెల వేతనాన్ని విరాళంగా అందిస్తున్నట్లు ప్రకటించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్‌లు నజీర్ అహ్మద్, దివ్యకళ, కమిషనర్ గంగిరెడ్డి, కౌన్సిల్ సభ్యులు రాందాసుగౌడు, నాగేషప్ప, కాశింబేగ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ ఫ్లోర్‌లీడర్ దయాసాగర్

నరసింహులు కుటుంబాన్ని ఆదుకుంటాం

ఆదోని, సెప్టెంబరు 20 : ఆదోని మండలం నాగలాపురం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ఈడిగ పెద్ద వీరేష్ కుమారుడు నరసింహులు కుటుంబాన్ని అన్ని రకాలుగా ఆదుకుంటామని టీడీపీ సీనియర్ నేత ఉమాపతి నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం మట్టి ఖర్చుల నిమిత్తం తన వంతు ఆర్థిక సహాయం చేశారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నాయకుడు ఉమాపతినాయుడు

గొర్రెల కాపరి మృతి

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 20: ఎమ్మిగనూరు మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన గొర్రెల కాపరి బోయ డాటప్ప(52) మూడు రోజుల క్రితం గ్రామ సమీపంలోని పొలాల్లో మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గొర్రెల కాపరి బోయ డాటప బుధవారం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అయితే కుటుంబ సభ్యులు గొర్రెలను కాసేందుకు వెళ్లాడనుకున్నారు. గ్రామ సమీపంలోని పొలాల్లో మృతదేహాన్ని గమనించిన గ్రామస్థులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 20: ఎమ్మిగనూరు మండల పరిధిలోని బనవాసి గ్రామానికి చెందిన రామలక్ష్మి(26) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. రామలక్ష్మి 15వ తేదీన రాత్రి ఇంట్లో పాముకాటుకు గురి కావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందిందన్నారు. మృతురాలికి భర్త మల్లికార్జున, ఇద్దరు మగపిల్లలు ఉన్నారన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నందవరం: నందవరంలో కుమ్మరి చంద్ర (53) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. ఈ నెల 17న చంద్ర తమ పంట పని నిమిత్త పొలానికి వెళ్లారు. పనులు ముగిసిన తర్వాతా జీవతం పై విరక్తి చెంది మద్యంకు బానిసై ఇంట్లో ఉన్న పురుగుల మందును మద్యం మందు గ్లాసులో కలుపుకొని తాగాడు. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. బంధువులు కొడుకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

నందవరం, సెప్టెంబరు 20: నందవరంలో కురవ స్రవంతి(24) శుక్రవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. స్రవంతికి గత 5 ఏళ్ల క్రితం వివాహమైంది. గత కొన్నేళ్ల నుంచి మానసిక స్థితి సరిగ్గా లేదని, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిందని కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసుల తెలిపారు.

దాడులను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలం

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 20: మహిళలపై దాడులను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఐద్వా జిల్లా నాయకులు పీఎస్ సుజాత, జయమ్మ, రషీదాలు అన్నారు. శుక్రవారం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న కల్లుకుంట గ్రామానికి చెందిన గోవిందమ్మను వారు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు.

మహిళ ఆత్మహత్య

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 20: పత్తికొండ మండలం పుచ్చకాయలమాడ గ్రామంలో శుక్రవారం ఓ మహిళ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గ్రామానికి చెందిన కళ్యాణ్ మొదటి భార్య అనారోగ్యంతో మృతి చెందడంతో తుగ్గలి మండలం పగిడిరాయి గ్రామానికి చెందిన రూప (24) అనే మహిళను మూడేళ్ల క్రితం రెండో వివాహం చేసుకున్నాడు. వీరికి ఏడాది బాలుడు రూపాంత్ సంతానం. అయితే.. శుక్రవారం తన ఏడాది బాలుడు ఎదుటే తల్లి ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. చిన్నారి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి ఫ్యాన్‌కు వెలాడుతున్న ఆమెను కిందికి దించారు. అప్పటికే మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని సీఐ జయన్న తెలిపారు.

భర్తపై ఫిర్యాదు

ఆదోని రూరల్ సెప్టెంబర్ 20 : ఆదోని మండలం చిన్న పెండేకల్లు గ్రామానికి శిల్పా భర్త రామాంజనేయులుపై తాలుక పోలీసులకు ఫిర్యాదు చేసింది. రెండు సంవత్సరాల క్రితం బళ్లారికి చెందిన రామాంజనేయులుతో శిల్పాకు వివాహమైంది. నాటి నుంచి ఇప్పటి వరకు అదనపు కట్నం తీసుకురావాలని, శారీరకంగా, మానసికంగా తనను వేధిస్తున్నాడని బాధిత మహిళ ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ రామాంజనేయులు తెలిపారు.

గంజాయిపై ఉక్కు పాదం మోపుతాం: డీఎస్పీ



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకట్రామయ్య

పత్తికొండ, సెప్టెంబరు 20 : గంజాయిపై ఉక్కుపాదం మోపుతామని డీఎస్పీ వెంకట్రామయ్య అన్నారు. శుక్రవారం పత్తికొండ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొద్ది రోజుల క్రితం పత్తికొండ పట్టణంలో జరిగిన వినాయక నిమజ్జనంలో గట్టి పోలీసుబందోబస్తు నిర్వహించి ప్రశాంతంగా కార్యక్రమాన్ని పూర్తి చేశామన్నారు. అయితే రెండు విగ్రహాలకు చెందిన ఊరేగింపు వద్ద యువకులు గొడవకు దిగడంతో సీఐ జయన్న సిబ్బందితో గుంపులను చెదరగొట్టి పరిస్థితిని అదుపు చేశారని తెలిపారు. అయితే ఆ రోజు గొడవలో యువకుల వీరంగం గమనించి ఆరా తీస్తే అందులో కొందరు గంజాయి తీసుకున్నట్లు తెలిసిందన్నారు. ఆ దిశగా నిఘా ఏర్పాటు చేసి రెండురోజుల క్రితం రెండు ఖరీదైన మోటార్ సైకిళ్లపై గంజాయిని సరఫరా చేస్తున్న నలుగురు యువకులను అరెస్టు చేశామని చెప్పారు. వారి వద్ద ఉన్న మోటార్‌సైకిళ్ల దొంగలించినవిగా గుర్తించి నాగలాపురం పోలీస్‌స్టేషన్‌లో వాటి చోరీ కేసును నమోదు చేశామన్నారు. పట్టుబడిన యువకులను విచారించగా ఆస్పరి మండలంలో ఓ వ్యక్తి నుంచి గంజాయి తీసుకున్నట్లు సమాచారం అందిందని తెలిపారు. ఆస్పరి పోలీసుల సహకారంతో గంజాయి పండిస్తున్న వ్యక్తిని అరెస్టు చేయడంతోపాటు ఆయన రహస్యంగా పండిస్తున్న 53 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నలుగురు యువకులపై పత్తికొండలో, ఆస్పరిలోని వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపామన్నారు. గంజాయి పెంపకం, అమ్మకాలపై ప్రత్యేక నిఘాను ఉంచామని, త్వరలోనే ఇందులోభాగస్వాములుగా ఉన్నవారందరినీ పట్టుకుంటామన్నారు. ఆయనతోపాటు సీఐలు జయన్న, పులిశేఖర్‌లు ఉన్నారు.

ప్లాటినం జూబ్లీ ఉత్సవాలను జయప్రదం చేయండి



ఉత్సవాల వివరాలను వెల్లడిస్తున్న కమిటీ సభ్యులు

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 20: ఎమ్మిగనూరు పట్టణంలో ఉన్న ప్రభుత్వ ఉన్నతపాఠశాల, జూనియర్ కళాశాలల ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు జయప్రదం చేయాలని ప్లాటినం జూబ్లీ కమిటీ సభ్యులు కోరారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆడిటోరియంలో సభ్యులు మాట్లాడుతూ పాఠశాల, కళాశాలలు ఆవిర్భవించి 75ఏళ్ల పూర్తవుతుండడంతో ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 29 ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సవ వేడుకలు జరుగుతాయన్నారు. సమ్మేళనంలో పాల్గొనే పూర్వ విద్యార్థులు 8328607052, 9440554337లకు ఫోన్‌చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో కమిటీ సభ్యులు మాచాని శివకుమార్, హరి నాయరాయణ రెడ్డి, బైలుప్పల షఫీవుల్లా, ప్రకాష్ జైన్, మామిడి మల్లికార్జున, నటరాజ్ రెడ్డి, మురళీ కృష్ణ, రామకృష్ణ నాయుడు, మాచాని వెంకటేష్, కామశే గణేష్, కృష్ణ, బాలాజి, శీను, ఈరన్న గౌడ్, శ్రీనివాసులు, ఎల్లప్ప, జబీర్ బాషా, నటరాజ్‌లు పాల్గొన్నారు.

కేసు నమోదు

ఆస్పరి, సెప్టెంబరు 20 : మండలంలోని వలగొండ గ్రామానికి చెందిన ఎల్లమ్మను గాయపరిచిన అదే గ్రామానికి చెందిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ మస్తాన్ వలి శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఆస్తి విషయంలో పెద్ద పరిశప్ప, చిన్న పరిశప్ప, శీనమ్మతో పాటు మరో ముగ్గురు కలిసి కైరుప్పల బ్యాంకుకు వస్తున్న ఎల్లమ్మను మార్గమధ్యంలో చితకబాదారని తెలిపారు. బాధితురాలు ఎల్లమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

పత్తి పంటను దున్నేశారు..

- పోలీసులను ఆశ్రయించిన బాధితులు

ఆదోని రూరల్ సెప్టెంబర్ 20 : ఆదోని మండలం దొడ్డనగేరి గ్రామానికి చెందిన నరసమ్మ పత్తి పంట పొలాన్ని గుర్తు తెలియని దుండగులు ఎక్స్‌కవేటర్‌తో దున్నేశారు. నరసమ్మకు గ్రామానికి 2కి.మీ., దూరంలో సర్వే నెం.44లో ఎకరన్నర పొలం ఉంది. ఈ పొలానికి ఆనుకొని సర్వే నెం.46లో ప్రభుత్వ కొండ పోరంబోకు భూమిలో 20 సెంట్ల భూమిని గత 30 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నారు. ఈ మధ్యకాలంలో రెవిన్యూ, పంచాయతీ, ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు సర్వే నెం.46లో 20 సెంట్ల భూమి ప్రభుత్వానికి చెందింది కావడంతో, ఇందులో 10 సెంట్ల స్థలంలో ఎస్‌డబ్ల్యూ పీసీ షెడ్డును నిర్మించాలని ఈ స్థలాన్ని ఎన్ఆర్ఈజీఎస్ అధికారులకు రెవిన్యూ అధికారులు అప్పజెప్పారు. అయితే గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు 20 సెంట్ల స్థలంలో ఉన్న పత్తి పంటను ఎక్స్‌కవేటర్‌తో దున్నేశారు. విషయం తెలుసుకొన్న నరసమ్మ కొడుకు నరసన్న పెద్దతుంబళం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చేపలు పెంచేందుకు వేలాలు

తుగ్గలి, సెప్టెంబరు 20: ఈ ఏడాది భారీ వర్షాలు కురవడంతో చెరువులు నిండాయి. ఆ చెరువులో చేపలు వదలడం కోసం వేలం పాటలను ఈవోఆర్డీ గోపాల్ నిర్వహించారు. శుక్రవారం జొన్నగిరిలో చెరువులో చేపలు వదలడం కోసం సర్పంచు ఓబులేసు అధ్యక్షతన వేలం పాటలు నిర్వహించారు. ఈ వేలం పాటలో టీడీపీ నాయకులు పుల్లన్న రూ.15 లక్షలకు పాట పాడి దక్కించుకున్నారు. అలాగే ఆటో సుంకం వసూలు చేయడం కోసం గ్రామానికి చెందిన కుమార్ రూ.34,500లకు పాట పాడి దక్కించుకున్నారు. అలాగే చెరువులో చేపలు వదిలి పెంచడం కోసం ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యాకమిటి ఛైర్మన్ మిద్దె రవి, టీడీపీ నాయకులు బాలన్న, లక్ష్మణస్వామి, సంగాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రూ.1.50 లక్షల విరాళం

మంత్రాలయం, సెప్టెంబరు 20: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి కర్నాటకలోని మాండ్య పట్టణానికి చెందిన కామరదేవ నాగప్ప అనే భక్తుడు విద్యకు రూ.1.25 లక్షలు, అన్నదానానికి రూ. 25వేలు విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్‌లు తెలిపారు. శుక్రవారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని రూ.1.50 లక్షలు చెక్కులను విరాళం ఇచ్చినట్లు తెలిపారు.